TGTEL/25/A1132

ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

మానవాళికి
# జనంవార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..


'జనంవార్త'
మీ వ్యాపార, ఉద్యోగ, రాజకీయ, వివాహా, జన్మదిన తదితర ప్రకటనల కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889

మేడ్చల్ | మంగళవారం | 23.09.2025 | సంపుటి : 1 | సంచిక : 91 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్



## దసరా బోనస్ ₹1,95,610

### 34శాతం బోనస్ ప్రకటించిన ప్రభుత్వం

దసరా సందర్భంగా సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అంవదించింది. ముందుగానే బోనస్ ప్రకటించింది. లాభాల్లో 34 శాతం కార్మికులకు పంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. ఒక్కో కార్మికుడికి బోనస్‌గా రూ.1,95,610 ఇవ్వనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో పలువురు మంత్రులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ మేరకు వెల్లడించారు. 04

# స్వదేశీ ఉత్పత్తులను వాడండి



### దేశీయ ఉత్పత్తులనే ప్రోత్సహిద్దాం

### దేశ ప్రజలకు ప్రధాని మోడీ లేఖ

నవరాత్రి మొదటి రోజైన సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు బహిరంగ లేఖను రాశారు. ఈ లేఖలో ఆయన దేశ ప్రజలందరికీ స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని సూచించారు. దుకాణదారులు అందరూ 'భారతదేశంలో తయారు చేసిన' ఉత్పత్తులను విక్రయించాలని విజ్ఞప్తి చేశారు. 'మనం గర్వంగా చెప్పకుందాం మనం కొనేది స్వదేశీ, మనం అమ్మేది స్వదేశీ' అని ప్రధాని బహిరంగ లేఖలో పేర్కొన్నారు. దేశంలో నూతన జీఎస్టీ సంస్కరణలు అమలులోకి రావడంతో తగ్గిన జీఎస్టీ రేట్లు 375 వస్తువులపై వర్తిస్తాయని పేర్కొన్నారు. ఆటోమొబైల్స్ నుంచి రోజువారీ వినియోగ వస్తువుల వరకు ఈ జీఎస్టీ తగ్గింపు జరిగిందని తెలిపారు. 02

– న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22




జాతినుద్దేశించి ఆదివారం ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ.. ఆదాయపు పన్ను సంస్కరణలతో పాటు, నేటి నుంచి అమల్లోకి వచ్చే జీఎస్టీ రేటు సవరణలతో భారతీయులు.. 2.5 లక్షల కోట్లు ఆదా అవుతుందన్నారు. ప్రధాని దీనిని 'బచత్ ఉత్సవ్' గా అభివర్ణించారు. తగ్గిన జీఎస్టీ రేట్లు పేదలకు, మధ్యతరగతికి గొప్ప ఉపశమనం కలిగిస్తాయని చెప్పారు.



## వీధి వ్యాపారుల కోసం ప్రత్యేక వెండింగ్ జోన్స్

- వీధి దీపాలకు సోలార్ విద్యుత్ వినియోగం
- చెరువుల వద్ద పైలట్ ప్రాజెక్టుగా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు
- అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి సూచన

వీధి వ్యాపారుల కోసం ప్రత్యేక వెండింగ్ జోన్స్‌ను ఏర్పాటు చేయాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. మల్టీ స్టోరేజ్ బిల్డింగ్స్, ఫైర్ సేఫ్టీ అంశాలపై పలు సూచనలు చేశారు ముఖ్యమంత్రి. వీధి దీపాలకు సోలార్ విద్యుత్ వినియోగం, కొత్తగా పునరుద్ధరిస్తున్న చెరువుల వద్ద పైలట్ ప్రాజెక్టుగా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు.

హైదరాబాద్,సెప్టెంబర్ 22 : తెలంగాణ రైజింగ్ కోర్ అర్బన్ ఏరియా అభివృద్ధిపై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రతిపాదనలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి అధికారులు తీసుకువచ్చారు.

- మిగతా 3వ పేజీలో





## రహదారుల నిర్మాణానికి త్వరగా భూసేకరణ

- భూ సేకరణ విషయంలో మానవీయ కోణం
- రైతులకు తక్షణమే పరిహారం అందేలా చేయాలి
- చిన్నచిన్న కారణాలతో పనులు ఆసల్యం కారాదు
- రహదారుల నిర్మాణపై ఉన్నత స్థాయి సమీక్షలో సిఎం రేవంత్

02

## ఓటుకు నోటు కేసులో ముగిసిన విచారణ

### తీర్పును రిజర్వ్ చేసిన సుప్రీం కోర్టు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:** ఓటుకు నోటు కేసు కేసుపై సుప్రీంకోర్టు సోమవారం విచార జరిపి, తీర్పును రిజర్వు చేసింది. రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసులో నాలుగో నిందితునిగా ఉన్న జెరూసలెం మత్తయ్యపై నమోదైన ఎఫ్ఐఆర్ ను కొట్టివేస్తూ కొన్ని రోజుల క్రితం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. దీనిని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో సవాల్ చేసింది.

- మిగతా 2వ పేజీలో



03

## నగరంలో మరోమారు కుంభవృష్టి

- భారీ వర్షంతో తల్లడిల్లిన రాజధాని
- రోడ్లపై నిలిచిన వాననీరు
- పలుచోట్ల ట్రాఫిక్ ఇబ్బందులు

రాజధాని హైదరాబాద్ నగరవ్యాప్తంగా నింబస్ మేఘాలు అలుముకున్నాయి. దీంతో నగరంలో మరోసారి భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం మూడు గంటల నుంచి తేలికపాటి జల్లులు పడుతూ వచ్చి, అనంతరం జోరు వానగా మారాయి. వర్షం కారణంగా రోడ్లపై నీరు నిలిచిపోయి, వాహనదారులు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులకు గురయ్యారు.

## పేదల ఇల్లు కూల్చి వారిని రోడ్డున పడేస్తారా?

### దమ్ముంటే బిల్డర్లు, నాయకుల ఆక్రమణలు కూల్చండి

- ఇందిరమ్మ రాజ్యం అంటూ పేదల గూడును కూలుస్తారా?
- గాజుల రామారంలో పర్యటించి బాధితులను పరామర్శించిన ఎంపీ ఈటల రాజేందర్

03





### ఆక్రమణలో తొలగింపులో వెనక్కి తగ్గం

- ఆక్రమణల నుంచి మొత్తం 923 ఎకరాల రక్షణ
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 22 : ఆక్రమణలను తొలగించడంలో వెనక్కి తగ్గేది లేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ మరోమారు స్పష్టం చేశారు. ఇప్పటివరకు మొత్తం 923 ఎకరాలను ఆక్రమణల నుంచి రక్షించామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు.

మిగతా 3 లో

## పేదల ఇళ్లపై బుల్డోజర్లు

- కాంగ్రెస్‌ను నమ్మినందుకు నిండా మునిగారు
- బీఆర్ఎస్ అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్య

పేదల ఇళ్లను కూల్చివేస్తోందని కాంగ్రెస్ ప్రభుత్వంపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. పేదలు కట్టుకున్న గూళ్లను కూల్చేస్తే వారు ఎక్కడికి పోతారని ప్రశ్నించారు. తాజా కూల్చివేతలపై ఆయన మండిపడ్డారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 08



03



10

### సభలకు వచ్చే జనమంతా ఓటేయరు

కమల్‌హాసన్



10

### పాక్ తీరుపై సిందూర్ పార్ట్ 2

కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

# స్వదేశీ ఉత్పత్తులను వాడండి

- దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహిద్దాం
- ప్రజలకు ప్రధానమంత్రి మోడీ బహిరంగ లేఖ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 :** నవరాత్రి మొదటి రోజైన సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు బహిరంగ లేఖను రాశారు. ఈ లేఖలో ఆయన దేశ ప్రజలందరికీ స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని సూచించారు. దుకాణదారులు అందరూ 'భారతదేశంలో తయారు చేసిన' ఉత్పత్తులను విక్రయించాలని విజ్ఞప్తి చేశారు. 'మనం గర్వంగా చెప్పుకుందాం – మనం కొనేది స్వదేశీ, మనం అమ్మేది స్వదేశీ' అని ప్రధాని బహిరంగ లేఖలో పేర్కొన్నారు. దేశంలో నూతన ఏ÷ు సంస్కరణలు అమలులోకి రావడంతో తగ్గిన రేట్లు– 375 వస్తువులపై వర్తిస్తాయని పేర్కొన్నారు. ఆటోమొబైల్స్ నుంచి రోజువారీ వినియోగ వస్తువుల వరకు ఈ జీఎస్టీ తగ్గింపు జరిగిందని తెలిపారు. జాతినుద్దేశించి ఆదివారం ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ.. ఆదాయపు పన్ను సంస్కరణలతో పాటు, నేటి నుంచి అమల్లోకి వచ్చే జీఎస్టీ రేటు– సవరణలతో భారతీయులు.. 2.5 లక్షల కోట్లు ఆదా అవుతుందన్నారు. ప్రధాని దీనిని 'బచత్ ఉత్సవ్' గా అభివర్ణించారు. తగ్గిన జీఎస్టీ రేట్లు పేదలకు, మధ్యతరగతికి గొప్ప ఉపశమనం కలిగిస్తాయని చెప్పారు. ఈ సంస్కరణలతో య–ువత, రైతులు, మహిళలు, దుకాణదారులు, వ్యాపారులు, వ్యవస్థాపకులు అందరూ గొప్ప ప్రయోజనం పొందుతారని అన్నారు. పండుగ సీజన్‌లో జీఎస్టీ తగ్గింపు అనేది ప్రజలకు మరింత ఆదా అవుతుందన్నారు. కొత్త జీఎస్టీ విధానం మధ్యతరహా, చిన్న వ్యాపారాలపై చూపే సానుకూల ప్రభావాన్ని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. ఇది పోటీ–తత్వాన్ని, ఆర్థిక వ్యవస్థను పెంచుతుందని అన్నారు. జీఎస్టీ తగ్గింపుతో స్నాక్స్, కాఫీ, నెయ్యి, పనీర్, వెన్న, కెచప్, జామ్, డ్రై ఫ్రూట్స్, ఐస్ క్రీం వంటి రోజువారీ వినియోగ వస్తువులపై రేట్లు– తగ్గుతాయి. టీ–వీలు, ఎయిర్ కండిషనర్లు, వాషింగ్ మెషీన్లు వంటి వస్తువులపై కూడా ఏ÷ు తగ్గించారు. ఔషధాలపై 12శాతంనుంచి 5శాతానికి జీఎస్టీ తగ్గించారు. క్యాన్సర్, జన్యుపరమైన, అరుదైన వ్యాధులకు కీలకమైన ప్రాణాలను రక్షించే మందులను పూర్తిగా పన్ను నుంచి మినహాయించారు.

# కేటీఆర్ పరువు నష్టంపై బండి కౌంటర్ దాఖలు

- ఫోన్ ట్యాపింగ్ నిందితుల వాంగ్మూలం ఆధారంగా ఆరోపణలు
- క్షమాపణలు చెప్పడం కూడా అనవసరం



**హైదరాబాద్, సెప్టెంబర్ 22 :** కేటీఆర్ వేసిన పరువు నష్టం దావాపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కౌంటర్ దాఖలు చేశారు. బండి సంజయ్ కుమార్ కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొన్న ప్రధాన అంశాలు ఇలా ఉన్నాయి: తాను చేసిన వ్యాఖ్యలు ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయిన నిందితులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఉన్నాయని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల కోసం ఫోన్‌లు ట్యాప్ చేయబడ్డాయని నిందితులు ఒప్పుకున్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో కేటీఆర్ పాత్ర గురించి తనకు తెలియదని సంజయ్ వ్యాఖ్యానించారు. కేటీఆర్ తెలంగాణను అత్యంత సంపన్న రాష్ట్రంగా మార్చారన్న పిటిషనర్ వాదనను ఆయన తోసిపుచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో వ్యవసాయం, విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. 2014 నుండి 2023 నవంబర్ వరకు రాష్ట్ర అప్పులు భారీగా పెరిగాయని, అలాగే పెండింగ్ బిల్లులు కూడా పెరిగాయని తెలిపారు. ఈ కేసులో కోర్టు ఇంజంక్షన్ మంజూరు చేస్తే, అది వాక్ స్వాతంత్ర్యానికి భంగం కలిగిస్తుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడినందుకు తన భావ ప్రకటన స్వేచ్ఛను అడ్డుకోవడం సరికాదని బండి సంజయ్ వాదించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్ ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసి ప్రతిపక్ష నాయకులు, న్యాయమూర్తులు, వ్యాపారవేత్తల ఫోన్‌లను ట్యాప్ చేయడానికి ఆదేశించారని ఆరోపించారు. కేటీఆర్ కోరిన రూ.10 కోట్లు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టంగా తెలిపారు. తాను చేసిన వ్యాఖ్యలు నిందితుల వాంగ్మూలం మరియు ప్రభుత్వ పబ్లిక్ డాక్యుమెంట్ల ఆధారంగా ఉన్నందున, క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదని బండి సంజయ్ అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

# జీఎస్టీ సంస్కరణలతో అనూహ్య పరిణామం

- అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరణ
- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



**భువనగిరి, సెప్టెంబర్ 22 :** జీఎస్టీలో తీసుకువచ్చిన సంస్కరణలతో ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించబోతోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. మోడీ సాహసోపేత నిర్ణయానికి ఇది నిదర్శనమన్నారు. దీంతో పేదలకు గణనీయంగా భారం తగ్గగలదని అన్నారు. జీఎస్టీ సంస్కరణలను అమలు చేసినందుకు కృతజ్ఞతగా భువనగిరి పట్టణంలోని వర్తకులు స్థానిక గంజి మార్కెట్ యార్డులో ప్రధాని మోదీకి కృతజ్ఞతగా ఏర్పాటు– చేసిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్థిక సంస్కరణలు చేపట్టిన ఏ దేశంలోనూ ఆ ప్రభుత్వం రెండోసారి అధికారంలో లేదని, ప్రజా ఆమోదయోగ్యంగా జీఎస్టీని అమలు చేసిన మోదీ రెండోసారి అధికారంలోకి వచ్చిన విషయాన్ని రామచందర్‌రావు గుర్తు చేశారు. పన్నులు తగ్గించడం ద్వారా ఉత్పత్తులు పెరగడంతోపాటు– సామాన్య ప్రజలకు భారం తగ్గుతుందని తద్వారా కొనుగోలు శక్తి పెరిగి ఎక్కువ స్థాయిలో పన్నులు వసూలు అవుతాయని ఆయన అన్నారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తాము కొనుగోలు చేసిన వస్తువులకు రసీదు తీసుకోవాలని అప్పుడే బ్లాక్ మార్కెటింగ్‌ను నిరోధించిన వారమవుతామన్నారు. స్వదేశీ వస్తువులను వినియోగించి దేశ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరిచేందుకు కృషి చేయాలన్నారు. భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి చంద మహేందర్ గుప్తా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్, కాసం వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్, స్థానిక వ్యాపారులు పాల్గొన్నారు. ఇదిలావుంటే అనారోగ్యంతో బాధపడుతూ 'మరణ వాంగ్మూలం' పేరుతో బహిరంగ లేఖ రాసిన మాజీ డీఎస్పీ దొనకొండ నళినిని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు సోమవారం సాయంత్రం పరామర్శించారు.

# రహదారుల నిర్మాణానికి త్వరగా భూసేకరణ

- భూసేకరణ విషయంలో మానవీయ కోణం
- రహదారుల నిర్మాణంపై రైతులకు వివరించాలి
- రైతులకు తక్షణమే పరిహారం అందేలా చేయాలి
- చిన్న చిన్న కారణాలతో పనులు ఆలస్యం కాకూడదు
- రహదారుల నిర్మాణంపై ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం రేవంత్



**హైదరాబాద్, సెప్టెంబర్ 22 :** తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి భూసేకరణ, పరిహారం పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. భూసేకరణ విషయంలో మానవీయ కోణంలో వ్యవహరించాలని... అదే సమయంలో రహదారుల నిర్మాణంతో కలిగే లాభాలను రైతులకు వివరించి ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. ఆర్బిట్రేషన్ కేసులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం, అనుమతుల జారీ, నూతన ప్రతిపాదనలకు ఆమోదం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ), జాతీయ రహదారుల విభాగం (ఎన్‌హెచ్), జాతీయ రహదారులు, రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ (మోర్త్), రహదారులు, భవనాల శాఖ, అటవీ శాఖ అధికారులతో సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారులకు నెంబర్ల కేటాయింపులో సూత్రప్రాయ అంగీకారం తెలుపుతున్నా తర్వాత ప్రక్రియలో ఆలస్యం పై ముఖ్యమంత్రి ఆరాటీశారు. చిన్న చిన్న కారణాలతో పలురహదారుల పనుల్లో జాప్యం వాటిల్లడం సరికాదని వెంటనే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు సీఎం సూచించారు. భూసేకరణను వేగవంతం చేసి పరిహారం తక్షణమే అందేలా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని సూచించారు. రీజినల్ రింగు రోడ్ (ఆర్ఆర్ఆర్) నార్త్ నిర్మాణానికి సంబంధించి కేంద్రం లేవనెత్తిన పలు అంశాలపై సమీక్ష ఆరాటీశారు. సందేహాలన్నిటిని ఒకేసారి పంపాలనిఅధికారులకు సూచించారు. ఆ అంశంపై తాము చర్చించుకున్నామని, ఎటువంటి సందేహాలు లేవని, ఏవైనా ఉంటే వెంటనే పంపుతామని ఎన్‌హెచ్ఏఐ అధికారులు సీఎంకు తెలియజేశారు. ఆర్ఆర్ఆర్ నార్త్, సౌత్‌ను రెండు వేర్వేరు ప్రాజెక్టులుగా చూడవద్దని, సౌత్‌కు కూడా నార్త్‌కు ఇచ్చిన నెంబర్‌ను కొనసాగించాలని, వెంటనే అనుమతులు మంజూరు చేసి ఏకకాలంలో రెండిరటి పనులు ప్రారంభమయ్యేందుకు సహకరించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులకు సీఎం సూచించారు. అందుకు ఎన్‌హెచ్ఏఐ అధికారులు సుముఖత వ్యక్తం చేశారు.

### ఆర్ఆర్ఆర్ సౌత్ అలైన్‌మెంట్‌కు వెంటనే ఆమోదం ముద్రవేయాలి

ఆర్ఆర్ఆర్ సౌత్ అలైన్‌మెంట్‌కు వెంటనే ఆమోదం ముద్రవేయాలని సీఎం కోరారు. భారత్ ఫ్యూచర్సిటీ–అమరావతి–మచిలీపట్నం 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవేకు వెంటనే అనుమతులు ఇవ్వాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఫ్యూచర్ సిటీ లో తాము డ్రైపోర్ట్, లాజిస్టిక్ పార్క్, ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తామని సీఎం తెలిపారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేతో రెండు రాష్ట్రాల రాజధానుల మధ్య అనుసంధానం ఏర్పడడంతో సరుకు రవాణా, ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని సీఎం అన్నారు. హైదరాబాద్–విజయవాడల మధ్య 70 కిలోమీటర్లు దూరం తగ్గడంతో పాటు సరుకు రవాణాలో భారత్ దేశంలో మరే జాతీయ రహదారిపై లేని తరద్దీ, ఆదాయం ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేతో ఉండాలని సీఎం తెలిపారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలోనూ రెండు రాష్ట్రాల మధ్య గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మించాలనిపేర్కొన్నారని సీఎం గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో తక్షణమే రంగంలోకి దిగిపీఎం గతి శక్తి లేదా మరేపథకంలోనైనా ఈ రహదారికి అవసరమైన అనుమతులు ఇవ్వాలని, అలైన్‌మెంట్ ఖరారు చేయాలని సూచించారు. ఈ రహదారికి సమాంతరంగా తాము రైలు మార్గం అడుగుతున్నామని, బెంగళూరు–శంషాబాద్ ఎయిర్‌పోర్ట్–అమరావతి మధ్య రైలు మార్గం అవసరమని, వందేభారత్ సహా ఇతర రైళ్ల రాకపోకలకు ఇది అనువుగా ఉంటుందని, లాభసాటిమార్గమని సీఎం అన్నారు.

హైదరాబాద్–శ్రీశైలం మార్గంలో రావిర్యాల– మన్ననూర్‌కు సంబంధించి ఎలివేటెడ్ కారిడార్‌కు వెంటనే అనుమతులు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. శ్రీశైల దేవస్థానం, శ్రీశైలం రిజర్వాయర్, ట్కెగర్ ఫారెస్ట్ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు రాకపోకలు సాగుతుందని సీఎం తెలిపారు. ఎలివేటెడ్ కారిడార్‌కు అవసరమైన అనుమతులు మంజూరు చేసి తక్షణమే పనులు ప్రారంభించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులకు సీఎం సూచించారు. హైదరాబాద్–మన్నెగూడ రహదారిలో మర్రి చెట్ల తొలగింపుకు సంబంధించి ఎన్జీటీలో ఉన్న కేసు పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సీఎం సూచించారు. హైదరాబాద్–మంచిర్యాల–నాగ్‌పూర్ నూతన రహదారికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సమర్పించిన ప్రతిపాదనలను అంగీకరించాలని సీఎం కోరారు. తాము ప్రతిపాదించిన మార్గంతో నూతన పారిశ్రామిక పార్కుల ఏర్పాటుతో పాటు పలు జాతీయ రహదారుల అనుసంధానం పూర్తవుతుందని సీఎం తెలిపారు. మంచిర్యాల–వరంగల్–ఖమ్మం–విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్–163జి), ఆర్మూర్–జగిత్యాల–మంచిర్యాల (ఎన్‌హెచ్–63), జగిత్యాల–కరీంనగర్ (ఎన్‌హెచ్–563), మహబూబ్‌నగర్–మరికల్–దియోసుగూర్ (ఎన్‌హెచ్–167) రహదారులకు సంబంధించి భూసేకరణ, పరిహారం పంపిణీలో జాప్యం పై ఆయా జిల్లాల కలెక్టర్లను వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. పలుచోట్ల కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయనికలెక్టర్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. అన్ని జిల్లాల్లో ఉన్న కేసులన్నింటిపై నివేదిక రూపొందించి వారంలోపు అడ్వకేట్ జనరల్‌తో చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

### పరిహారం పంపిణీలో ఆలస్యంపై ఆగ్రహం

పరిహారం పంపిణీలో ఆలస్యంపై సీఎం ప్రశ్నించగా కాలా నుంచి నిధుల విడుదలలో జాప్యం ఉందని కలెక్టర్లు తెలిపారు. ఈ విషయంపై ఎన్‌హెచ్ఏఐ అధికారులు స్పందిస్తూ జాబితాలు అప్‌లోడ్ అయిన వెంటనే నిధులు విడుదల చేస్తున్నామని, కలెక్టర్లు ఆ పనులను త్వరగా చేయాలని సూచించారు. ఈ విషయంలో ఏమాత్రం జాప్యాన్ని సహించమని సీఎం కలెక్టర్లను హెచ్చరించారు. భూసేకరణలో ఆర్బిట్రేషన్ కేసులు పెండింగ్‌లో ఉంచడం సరికాదని వెంటనే వాటిని పూర్తి చేయడంతో పాటు కాలా జాబితాలను అప్‌లోడ్ చేయాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. భూసేకరణ, పరిహారం పంపిణీని అక్టోబరు నెలాఖరుకు కచ్చితంగా పూర్తి చేయాల్సిందేనని సీఎం కలెక్టర్లను ఆదేశించారు. భూసేకరణ, పరిహార నిర్ణయం, పంపిణీ విషయంలో ఆలస్యం చూపే కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లపై చర్యలు తీసుకుంటామని సీఎం హెచ్చరించారు.

జాతీయ రహదారుల నిర్మాణంలో అటవీ, పర్యావరణ శాఖ పెడుతున్న కొర్రెలేషన్‌పై కూడా సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. 2002 నుంచి 2022 వరకు రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో అటవీ, పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించారని, దాంతో ప్రస్తుతం అనుమతులు ఇవ్వడం లేదని ఫారెస్ట్ సౌత్ రీజియన్ ఐజీ త్రినాధ్ కుమార్ తెలిపారు. దానిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసహనాన్ని వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో పని చేసిన అధికారులు ఇప్పుడు లేరన్నారు. ఉల్లంఘనలకు సంబంధించి వివరాలు సమర్పించాలని సీఎస్‌ను సీఎం ఆదేశించారు. అవసరమైన చోట ప్రత్యామ్నాయ భూమిని అటవీ పెంపకానికి ఇస్తామని సీఎం తెలిపారు. ఈ విషయంలో అవసరమైతే జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌లతో తాను స్వయంగా భేటీ అవుతానని సీఎం తెలిపారు. వన్యప్రాణులు లేని అటవీ ప్రాంతాల్లోనూ వన్యప్రాణుల చట్టం అమలుచేస్తున్నారని సీఎం అన్నారు. నాన్ వైల్డ్ లైఫ్ ఏరియాల్లో వైల్డ్ లైఫ్ మిటిగేషన్ ఎగ్జిక్యూషన్‌కు ఎన్‌హెచ్ఏఐలో ఎటువంటి ప్రొవిజన్స్ లేకపోవడంతో అనుమతులు ఆలస్యమవుతున్నాయని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంలో అవసరమైన వ్యయాన్ని భరించేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ విషయంలో చొరవ చూపి అటవీ అనుమతుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సీసీఎఫ్ డాక్టర్ సువర్ణకు సీఎం సూచించారు. తమ కార్యాలయ నిర్మాణానికి హైదరాబాద్‌లో రెండు ఎకరాల భూమి కేటాయించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. వారికి అవసరమైన భూమిని చూసి ప్రక్రియ ప్రారంభించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. తమ విజ్ఞప్తికి సత్వరమే స్పందించి అందుకు ఎన్‌హెచ్ఏఐ అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేంనరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ లు వీ. శేషాద్రి, కె.ఎస్. శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, ఆర్ అండ్ బీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వినయ్ కుమార్ రజావత్, ఎన్‌హెచ్ఏఐ సభ్యుడు (ప్రాజెక్ట్స్) అనిల్ చౌదరి, మోర్త్ రీజనల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్, ఎన్‌హెచ్ఏఐ రీజినల్ ఆఫీసర్ శివశంకర్, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీం తదితరులు పాల్గొన్నారు.

# పామాయిల్ ఫ్యాక్టరీ రైతుల జీవితాలకు గేమ్ ఛేంజర్

- నర్మెట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ మనకు ఎమోషన్
- ఎమ్మెల్సీలతో కలసి ఫ్యాక్టరీ సందర్శించిన హరీష్ రావు



**సిద్దిపేట, సెప్టెంబర్ 22 :** నర్మెట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ మనకు ఎమోషన్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. పామాయిల్ ఫ్యాక్టరీ రైతుల జీవితాలకు గేమ్ ఛేంజర్‌లాంటిదని తెలిపారు. 2018లో తేమ తక్కుందని ఆయిల్ పామ్ సాగుకు ఐఐఓపీఆర్ అనుమతి ఇవ్వలేదని, కాళేశ్వరం నీటితో ఎండల్లోనూ చెరువులు, చెక్ డ్యాములు మత్తళ్లు దుంకినయ్ అని.. భూముల్లో తేమశాతం పెరగడంతో ఆయిల్ పామ్‌కు అనుమతులు ఇచ్చారని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఏం చేయకుండానే ఇదంతా సాధ్యమైందా? అని హరీశ్ ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో హరీశ్‌రావు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ శివారులోని పామాయిల్ ఫ్యాక్టరీలో ఉత్పత్తిని ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు వంటేరు ప్రతాపరెడ్డి, యాదవరెడ్డి, దేశపతి శ్రీనివాస్‌తో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్మెట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ మనకు ఎమోషన్ అని.. ఈ ఫ్యాక్టరీ వేలాది మంది రైతుల జీవితాల్లో గుణాత్మక మార్పును తీసుకువస్తుందన్నారు. మనం చాలా ఫాక్టరీలు చూస్తుంటామని.. కానీ, ఇది భిన్నమైందన్నారు. ఈ ప్రాంత రైతుల నవశకానికి ఈ ఫ్యాక్టరీ నాంది అని తెలిపారు. గాలిలో తేమ ఎక్కువ ఉన్న చోటనే పామాయిల్ పండుతుందని.. కేసీఆర్ కృషితో రాష్ట్రమంతా పామాయిల్‌కు అనుకూలంగా మారిందన్నారు. ఒక్కసారి పంట వేస్తే 30 సంవత్సరాల వరకు రైతుకు ఆదాయం వస్తుందన్న ఆయన.. ఉద్యోగులకు నెల రోజుకు జీతం వస్తే.. పామాయిల్ రైతులకు 20 రోజులకే డబ్బులు చేతికి అందుతాయన్నారు. ఇక్కడికి నీళ్లొచ్చినా.. ఆయిల్‌పామ్ సాగవుతున్నా అంతా కాళేశ్వరం పుణ్యమేనన్నారు. 2022 జూన్ 5న రామచంద్రాపూ–ర్‌లోని మడుపు ఎల్లారెడ్డి పొలంలో మొదటి మొక్కతో నాంది పలికామని.. అందరినీ బ్రతిమాలి నాదే బాధ్యత అని భరోసా ఇస్తే పామాయిల్ సాగు చేశారని హరీశ్‌రావుకు గుర్తు చేశారు. చుట్టు–పక్కల ఐదు జిల్లాల రైతులకు ఈ ఫ్యాక్టరీతో ప్రయోజనం ఉంటు–ందన్నారు. మొక్కలు నాటి ఆయిల్‌పామ్ సాగు చేసి ఫ్యాక్టరీ పెట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని.. అత్యాధునిక –టె–క్నాలజీతో ఈ ఫ్యాక్టరీని నిర్మించామన్నారు. ఆ ఫ్యాక్టరీ ప్రారంభించేందుకు కాంగ్రెసోళ్లు జేబులో కత్తెర పెట్టు–కొని తిరుగుతున్నారని సె–టైర్లు వేశారు. మన ప్రభుత్వం ఉంటే ఏడాది ముందే ఫ్యాక్టరీ ప్రారంభమయ్యేదన్నారు. వంద టన్నుల ఆయిల్ పామ్ గెలలకు 19 టన్నుల పామాయిల్ వస్తుందని హరీశ్‌రావు తెలిపారు. గోద్రెజ్, పతంజలి సహా అనేక కంపెనీల ప్రతినిధులు ఈ ఫ్యాక్టరీని చూసిపోతున్నారన్నారు. రాష్ట్రంలో పది లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ పెట్టాలన్నది కేసీఆర్ సంకల్పమని.. రైతును రాజును చేసే పంట ఆయిల్ పామ్ సాగు అని తెలిపారు. ఎకరానికి లక్షన్నర రూపాయలు వచ్చే బంగారం లాంటి పంట ఆయిల్ పామ్ అని.. ఇందులో ఇంతర పంటగా కోకో సాగు చేస్తే మరో లక్ష ఆదాయం వస్తుందన్నారు. ఈ పంటలతో ఎకరానికి ఏడాదికి రూ.2.50లక్షల ఆదాయం వస్తుందని వివరించారు.

# ఓటుకు నోటు కేసులో ముగిసిన విచారణ

## తీర్పును రిజర్వ్ చేసిన సుప్రీం కోర్టు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 :** ఓటుకు నోటు కేసు కేసుపై సుప్రీంకోర్టు సోమవారం విచార జరిపి, తీర్పును రిజర్వు చేసింది. రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసులో నాలుగో నిందితునిగా ఉన్న జెరూసలెం మత్తయ్యపై నమోదైన ఎఫ్ఐఆర్ ను కొట్టివేస్తూ కొన్ని రోజుల క్రితం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. దీనిని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. ఎఫ్ఐఆర్‌లో, ఛార్జిషీట్ లో నాలుగో నిందితునిగా ఉన్న జెరూసలెం మత్తయ్యపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని రాష్ట్ర ప్రభుత్వ తరపు న్యాయవాది మేనకా గురుస్వామి కోర్టుకు వెల్లడించారు. కేసు ప్రాథమిక దశలోనే నిందితునిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసిందని చెప్పారు. కేసులో కీలక నిందితునిగా ఉన్న జెరూసలెం మత్తయ్యపై ఎఫ్ఐఆర్ కొట్టివేయటం మొత్తం దర్యాప్తుపై ప్రభావం చూపుతుందన్నారు. కోర్టు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేసి దర్యాప్తు కొనసాగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కాగా, జెరూసలెం మత్తయ్య తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ హైకోర్టు అన్ని అంశాలను పరిశీలించిన తరువాతే ఉత్తర్వులు ఇచ్చిందని వెల్లడించారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్.గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం దీనిపై తీర్పును రిజర్వ్ చేసింది. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేసులో సిఎం ఉన్నా నిందితునిపై నమోదైన ఎఫ్ఐఆర్ కొట్టి వేయటాన్ని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేయటం అభినందనీయ మన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ తరపు న్యాయవాది మేనకా గురుస్వామి స్పందిస్తూ అది రాష్ట్ర ప్రభుత్వనికి ఉన్న నిబద్ధత అని పేర్కొన్నారు.



# ఎన్‌కౌంటర్‌లో మరో ఇద్దరు మావోయిస్టు అగ్రనేతల హతం

**రాయపూర్ :** ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో మరో ఎన్‌కౌంటర్ జరిగింది. ఇందులో ఇద్దరు అగ్ర నేతలు హతమయ్యారు. ఎదురు కాల్పుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఇద్దరు మృతిచెందారు. మృతులను మావోయి స్ట కేంద్ర కమిటీ సభ్యులు కట్టా రామచంద్రారెడ్డి అలియాస్ రాజు, కడారి సత్యానారాయణ రెడ్డి అలియాస్ కోసాగా గుర్తించారు. ఘటనా స్థలిలో ఏకే 47, ఆయుధాలు, పేలుడు పదార్థాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌ను బస్తర్ ఐజీ సుందర్ రాజ్ ధ్రువీకరించారు.

### సమ్మక్కసాగర్ ప్రాజెక్ట్‌కు ఛత్తీస్‌ఘడ్ సుముఖత

### నీటమునిగే భూమికి పరిహారం చెల్లింపునకు ఉత్తమ్ అంగీకారం

**రాయ్‌పూర్, సెప్టెంబర్ 22(ఆర్ఎన్ఎ):** తెలంగాణ రాష్ట్రంలోని సమ్మక్కసాగర్ ప్రాజెక్ట్‌కు ఎన్‌ఓసీ ఇచ్చేందుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ముందుకు వచ్చింది. రాయ్‌పూర్‌లో సీఎం విష్ణు దేవ్ సాయిని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ కలిశారు. నీట మునిగే భూభాగం పరిహారం భరించేందుకు తెలంగాణ అంగీకారం తెలిపింది. ములుగు జిల్లాలో 6.7 టీఎంసీ సామర్థంతో ఈ సమ్మక్క సాగర్ డ్యామ్ నిర్మాణం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టు వల్ల నల్గొండ, వరంగల్‌లో తాగునీటి సమస్యలకు పరిష్కారం లభించనుంది. రామప్ప–పాఖాల లింక్ కెనాల్ కింద కొత్తగా 12,146 ఎకరాలకు నీరు అందుతుంది. వరంగల్, సూర్యాపేట, మహబూబాబాద్, జనగాం, ఖమ్మం జిల్లాలకు లబ్ధి చేకూరుతుంది. నల్గొండ, వరంగల్‌లో తాగునీటి సమస్యలకు సమ్మక్కసాగర్ పరిష్కారం దక్కుతుంది. 90 కిలోమీటర్ల టన్నెల్ నెట్‌వర్క్‌తో భారీ ఇంజనీరింగ్ డిజైన్ కింద మూడు పంప్‌హౌసులు, క్రాస్ డ్రెయినేజ్ వర్క్స్ ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మించ నున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో 73 హెక్టార్ల భూభాగం నీట మునిగే అవకాశం ఉంది. పరిహారం, పునరావాసం భరించేందుకు తెలంగాణ సిద్ధం అని ఛత్తీస్‌ఘడ్ సిఎంకు మంత్రి ఉత్తమ్ హామీ ఇచ్చారు. ఐఐటీ– ఖరగ్‌పూర్ సబ్‌మెర్జెన్స్ స్టడీ ఫైండింగ్స్ అమలు చేస్తామని ఉత్తమ్ తెలిపారు. ఎన్‌ఓసీ జారీకి ముందే అడ్వాన్స్ చెల్లింపులు ఇవ్వడానికి తెలంగాణ సిద్ధంగా ఉందన్నారు.

జనం వార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..



# పేదల ఇల్లు కూల్చి వారిని రోడ్డున పడేస్తారా?

## దమ్ముంటే బిల్డర్లు.. నాయకుల ఆక్రమణలు కూల్చండి

- ఇందిరమ్మ రాజ్యం అంటూ పేదల గూడును కూలుస్తారా?
- పేదల జోలికి వస్తే మాడి మసి అవుతారు.. జాగ్రత్త!
- గాజుల రామారంలో పర్యటించి బాధితులను పరామర్శించిన ఎంపీ ఈటల రాజేందర్



**మేడ్చల్, సెప్టెంబర్ 22 :** ప్రభుత్వ స్థలాల్లో బిల్డర్లు, నాయకులు చేసిన అక్రమ ఆక్రమణలను తొలగించగల దమ్ము హైడ్రా అధికారులకు ఉంటే ముందు వాటినే కూల్చాలని బీజేపీ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సవాల్ విసిరారు. పేదల ఇళ్లను కూలగొట్టి వారి జీవితాలతో చెలగాటం ఆడొద్దని హెచ్చరించారు. రాజ్యాంగం అందరికి "కూడు, గూడు, గుడ్డ" ఇవ్వాలని చెబుతుందనీ, కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం పేదలపై దాడులు చేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామన్నా ఇప్పటివరకు ఇవ్వలేదని, కానీ ఇక్కడ నాలుగు దశాబ్దాలుగా నివసిస్తున్న పేదల ఇళ్లను మాత్రం కూల్చినందుకు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "గాజులరామారంలో బ్రోకర్లు ఉంటే వారిని అరెస్ట్ చేయండి, డబ్బులు రికవరీ చేయండి. కానీ పేదల జీవితాలతో ఆడుకోవద్దు. పేదలపై ప్రతాపం చూపొద్దు," అంటూ అధికారులకు హితవు పలికారు. సోమవారం ఆయన గాజుల రామారంలోని కూలిన ఇళ్లను పరిశీలించి బాధితులను పరామర్శించారు. బస్తీల్లో తిరిగి బాధితులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, కూల్చిన ఇళ్లకు తిరిగి కరెంట్, తాగునీరు వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### పేదల జోలికి వస్తే మాడి మసి అవుతారు

"ఇందిరమ్మ రాజ్యం అంటే పేదల జోలికి వెళ్లడమేనా?" అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రూ.2500 డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇప్పటికీ ఇవ్వలేదనీ, కానీ పేదల గుడిసెలను మాత్రం చెదరగొడుతున్నారని మండిపడ్డారు. "పేదల జోలికి వస్తే మాడి మసి అవుతారు" అంటూ అధికారులను హెచ్చరించారు. ఎవరి వ్యక్తిగత కోపంతోనో పేదల ఇళ్లు కూల్చడం అన్యాయమని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం బాధితులకు వెంటనే తిరిగి ఇళ్లు కట్టించాలి అని డిమాండ్ చేశారు.

### 300 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఐదు బస్తీలు:

గాజుల రామారంలోని ఐదు బస్తీల్లో ఉన్న పేదల ఇళ్లను హైడ్రా అధికారులు కూల్చినట్లు ఈటల తెలిపారు. 300 ఎకరాల ప్రభుత్వ భూమిలో తాతలు, తండ్రులు, ఇప్పుడు పిల్లలు నివసిస్తున్నారని చెప్పారు. ఒక ఎకరం భూమి రూ.5000కి అమ్ముడవుతున్న సమయంలో వీరు ఇక్కడికి వచ్చి స్థిరపడారని వివరించారు. తెలంగాణ వ్యాప్తంగా కంకర మిషన్ ఫ్యాక్టరీల్లో పనిచేయడానికి వడ్డెరలు వచ్చారని, ఇక్కడే పని చేస్తూ చేతులు, కాళ్లు నష్టపోయి జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "60 గజాల గుడిసెల్లో నివసించే వారిని కూడా హైడ్రా అధికారం చూస్తే విచారకరం" అన్నారు.

### జేసీబీలతో దాడి - పేదల కన్నీళ్లు:

"దొంగ దెబ్బలా పదుల సంఖ్యలో జేసీబీలతో ఆదివారం పేదల ఇళ్లను కూల్చారు. చిన్న పిల్లలు వర్షంలో తడుస్తూ రాత్రి గడిపారు. కరెంట్ స్తంభాలు కూల్చి, నీటిని కూడా ఆపేశారు," అంటూ తీవ్రంగా మండిపడ్డారు. బస్తీ ప్రజల పరిస్థితిని చూసి కనికరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. "బ్రోకర్లను ఉరి తీయండి, అరెస్ట్ చేయండి... కానీ 40 ఏళ్లుగా నివసిస్తున్న పేదల ఇళ్లను కూల్చకండి. ఆడబిడ్డలు బతుకమ్మ పండుగ జరుపుకోలేక కన్నీళ్లలో మునిగిపోతున్నారు," అని వ్యాఖ్యానించారు. "రూ.15 వేల కోట్ల స్థలాలు కాపాడామంటున్నారు, కానీ ఇక్కడ కేవలం 300 గుడిసెలు ఉన్నాయి. పేదల ఇళ్లు కూల్చి ప్రచారం చేసుకోవాలా?" అంటూ ఫైర్ అయ్యారు. "ఇప్పటికైనా ప్రభుత్వం బస్తీ ప్రజలతో మాట్లాడాలి. నరసింహ బస్తీ, బాలయ్య బస్తీ, గాలిపోచమ్మ బస్తీలో ఉన్నవారిని ఆదుకోండి. పిల్లల పుస్తకాలు, ఇంటి సామాన్లు తొక్కించి కన్నీళ్లు తెప్పించడమేంటి?" అని ప్రశ్నించారు. శంకర్ హిల్స్ వంటి చోట వంద కోట్లు విలువైన భూములు ఆక్రమిస్తే హైడ్రా ఎందుకు నిశ్శబ్దం?" అని ప్రశ్నల వర్షం కురిపించారు. "నోరు లేని వారిని కన్నీళ్లు పెట్టిస్తే మంచిది జరగదు. గాజుల రామారంలోని పేదలు పాకిస్థాన్, బంగ్లాదేశ్ వాళ్లా? భారతమాత బిడ్డలే కదా?" అంటూ నిలదీశారు. ఇప్పటికైనా పేదల ఇళ్లు కూల్చడం ఆపండి" అని ఎంపీ ఈటల రాజేందర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## వీధి వ్యాపారుల కోసం ప్రత్యేక వెండింగ్ జోన్లు

- వీధి దీపాలకు సోలార్ విద్యుత్ వినియోగం
- చెరువుల వద్ద పైలట్ ప్రాజెక్టుగా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి సూచన



**హైదరాబాద్, సెప్టెంబర్ 22 :** వీధి వ్యాపారుల కోసం ప్రత్యేక వెండింగ్ జోన్లు ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. మల్టీ స్టోరేజ్ బిల్డింగ్స్, ఫైర్ సేఫ్టీ అంశాలపై కూడా పలు సూచ నలు చేశారు. వీధి దీపాలకు సోలార్ విద్యుత్ వినియోగం, అలాగే కొత్తగా పునరుద్ధరిస్తున్న చెరువుల వద్ద పైలట్ ప్రాజెక్టుగా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. తెలంగాణ రైజింగ్ – కోర్ అర్బన్ ఏరియా అభివృద్ధిపై సంబంధిత అధికారులతో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రతిపాదనలను అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఐదు ప్రధాన అంశాల ప్రాతిపదికన అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం రేవంత్ రెడ్డి. కోర్ అర్బన్ రీజియన్‌లో వీధుల ఆధునీకరణ, సుందరీకరణ చేపట్టాలని మార్గనిర్దేశం చేశారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల అప్‌గ్రేడేషన్‌తో పాటు, విచ్చలవిడిగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను స్ట్రీమ్‌లైన్ చేసి తిరిగి స్థానచలనం (రీ–లొకేట్) చేయాలని దిశానిర్దేశం చేశారు. మంచినీటి మరియు మురుగునీటి వ్యవస్థల నిర్వహణ వేర్వేరుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమతుల విషయంలో వివిధ విభాగాల మధ్య సమన్వయం ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

## కేటీఆర్‌తో ట్రిపుల్ ఆర్ బాధితుల భేటీ

### స్థానిక ఎన్నికలు బహిష్కరించాలని పిలుపు

**హైదరాబాద్, సెప్టెంబర్ 22 :** ట్రిపుల్‌ఆర్ కారణంగా అన్యాయం జరిగితే నిలదీయాలని, స్థానిక ఎన్నికలను బహిష్కరించాలని భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. నల్గొండ, సూర్యాపేట జిల్లాలకు చెందిన ట్రిపుల్ ఆర్ బాధితులంతా ఐకమత్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం తెలంగాణ భవన్‌లో నల్గొండ, సూర్యాపేట జిల్లాల ట్రిపుల్ ఆర్ బాధితులు కేటీఆర్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సమస్య పరిష్కారం కాకపోతే త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించాలన్నారు. స్థానిక ఎన్నికలు బహిష్కరించడం ద్వారా సమస్య ఢిల్లీకి వెళ్లే అవకాశం ఉందన్నారు. అసెంబ్లీలో మాకు మైక్ ఇవ్వడం లేదన్నారు. "మైక్ ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం భయపడుతోంది. కత్తి వాళ్ల చేతిలో పెట్టారు... మమ్మల్ని యుద్ధం చేయమంటున్నారు," అని విమర్శించారు. కాంగ్రెస్ నేతల భూముల్లో రోడ్డు వెళ్లకుండా అలైన్‌మెంట్ మార్చడం కొత్త కాదన్నారు. "గతంలో ఔటర్ రింగ్ రోడ్ వేసినప్పుడు కూడా అష్టవంకర్లు తిప్పారు. అప్పట్లో భూసేకరణ సమయంలో భూమికి బదులుగా భూమిని ఇచ్చారు," అని గుర్తుచేశారు. "ఇప్పుడూ ట్రిపుల్ ఆర్ వల్ల భూమిని కోల్పోతున్న రైతులకు భూమే కావాలంటే పోరాటం చేయాలి. అలైన్‌మెంట్ శాస్త్రీయంగా ఉండాలని ఉద్యమం చేద్దాం," అని కేటీఆర్ సూచించారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు జగదీశ్ రెడ్డి, కర్నె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఆర్‌పై స్పష్టత ఇవ్వండి

### లేకుంటే ప్రతిఘటన తప్పదు : సిపిఎం

**హైదరాబాద్, సెప్టెంబర్ 22 :** రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పు, నిర్వాసితులకు పరిహారంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనివ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదలచేశారు. రైతులతో మాట్లాడకుండా, గ్రామసభలు నిర్వహించకుండా, భూసేకరణలో స్పష్టతలేకుండా బలవంతంగా భూములను తీసుకోవాలని ప్రయత్నిస్తే రైతుల నుంచి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. 8 జిల్లాలు, 33 మండలాలు, 163 గ్రామాల పరిధిలో ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ కోసం 100 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మించాలని హెచ్ఎండీఏ మొదట నోటిఫికేషన్ ఇచ్చిందని, దాన్ని మార్చి రెండోసారి, మళ్లీ మూడోసారి అలైన్‌మెంట్‌ను విడుదల చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నట్టు జాన్‌వెస్లీ తెలిపారు.

## నళినికి అండగా ఉంటాం

### సిఎం రేవంత్ ఆదేశాలతో కలెక్టర్ పరామర్శ

**హైదరాబాద్, సెప్టెంబర్ 22 :** మాజీ డీఎస్పీ నళిని తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు సోషల్ మీడియా ద్వారా వెల్లడించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావును నళిని ఇంటికి పంపించారు. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ డీఎస్పీని యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు కలిశారు. నళినిని కలెక్టర్ కలిసి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సాయం కావాలన్నా..ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్టు– కలెక్టర్ ఆమెకు వివరించారు. సర్వీసు ఇష్యూలు ఏం ఉన్నా నిబంధనల మేరకు త్వరలోనే పరిష్కరిస్తామన్న సీఎం సందేశాన్ని నళినికి తెలియజేశారు కలెక్టర్ హనుమంతరావు. సోషల్ మీడియా పోస్టులో నళిని ఇలా రాసుకొచ్చారు.. ఒక అధికారిణిగా, ఉద్యమకారిణిగా, రాజకీయవేత్తగా, ఆయుర్వేద ఆరోగ్య సేవికగా, ఆధ్యాత్మిక వేత్తగా సాగిన నా జీవితం ముగియబోతోంది. నాఆరోగ్య పరిస్థితి నెల రోజులుగా సీరియస్ గా ఉంది. ప్రస్తుతం క్రిటికల్ పొజిషన్ లో ఉన్నాను. మూడురోజుల నుండి నిద్ర లేదు. రాత్రంతా మహా మృత్యుంజయ మంత్రాన్ని జపిస్తూ గడుపుతున్నాను. ఎనిమిది ఏండ్ల క్రితం సోకిన విలక్షణ కీళ్ల జబ్బు గత రెండు నెలలుగా –టైపాయిడ్ , డెంగ్యూ, చికెన్ గున్యా వైరస్ల వల్ల తీవ్ర స్థాయికి చేరింది. కనకణం పేలిపోతున్నట్లు–, ఏ కీలుకా కీలు విరిచేసినట్లు– నొప్పి. తట్టుకోలేక పోతున్నాను అంటూ తన బాధను వెల్లడించింది.

## ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

**మేడ్చల్ :** సీనియర్లతో గొడవ జరగడంతో మనస్తాపానికి గురై ఓ ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మేడ్చల్ జిల్లా మేడిపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది . పోలీసుల కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరుకు చెందిన జాదవ్ సాయితేజ(19) నారపల్లిలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. అక్కడే ఓ హాస్టల్‌లో ఉంటున్నాడు. అతడికి కళాశాలలోని సీనియర్ విద్యార్థులతో గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన సాయితేజ.. హాస్టల్‌లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మేడిపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.



## ఆక్రమణల తొలగింపులో వెనక్కి తగ్గం

- ఆక్రమణల నుంచి మొత్తం 923 ఎకరాల రక్షణ
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబర్ 22 :** ఆక్రమణలను తొలగించడంలో వెనక్కి తగ్గేది లేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ మరోమారు స్పష్టం చేశారు. ఇప్పటివరకు మొత్తం 923 ఎకరాలను ఆక్రమణల నుంచి రక్షించామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన వీడియో సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు రూ.50వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు రక్షించినట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలో దాదాపు 60 చెరువులు కనుమరుగయ్యాయని చెప్పారు. ఆరు చెరువులకు పూర్తిగా పునరుజ్జీవం కల్పించినట్లు వివరించారు. గాజులరామారంలో కొందరు రౌడీషీటర్లు ప్రభుత్వ భూమిని ఆక్రమించారని, ఆదివారం అక్కడి ప్రభుత్వ భూమిలోని ఆక్రమణలనే తొలగించామని పేర్కొన్నారు. ఇందులో నకిలీ పట్టాలు తీసుకుని నిర్మాణాలు చేపట్టారని చెప్పారు. ప్రభుత్వ భూమిలోని 260 నిర్మాణాలను తొలగించామని వెల్లడించారు. ప్రస్తుతం 51 డీఆర్ఎఫ్ బృందాలు ఉన్నాయని, త్వరలోనే వాటిని 72కి పెంచుతామని తెలిపారు. నగరంలో 150 మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ ఉన్నాయని చెప్పారు. నాలాల వద్ద ఆక్రమణలు గుర్తించి తొలగిస్తున్నామని, వాటిలో పూడిక తొలగింపును ముమ్మరం చేశామని వివరించారు. వర్షపు నీరు చెరువుల్లోకి వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందని, నీరు నిల్వ చేసే పరిస్థితి కూడా లేదని పేర్కొన్నారు. కాంక్రీటైజేషన్ వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకడం లేదని, అధిక కాలుష్యం వల్ల నగరాల్లోనే వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయని తెలిపారు. "భవిష్యత్ అంతా యువతరానిదే కాబట్టి, పార్కులు, చెరువుల గురించి జెన్జడ్ ఆలోచించాలి" అని రంగనాథ్ సూచించారు.

## 26న బతుకమ్మ కుంట ప్రారంభం

**హైదరాబాద్, సెప్టెంబర్ 22 :** హైదరాబాద్ అంబర్ పేటలోని బతుకమ్మ కుంటను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెప్పారు. సెప్టెంబర్ 26న బతుకమ్మ కుంటను ప్రారంభిస్తారని తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకే చెరువును పునరుద్ధరిస్తున్నామని చెప్పిన ఆయన.. ఎక్కడా కోర్టులను దిక్కరించడం లేదని చెప్పారు. చెరువుల పునరుద్ధరణలో భాగంగా బతుకమ్మ కుంటను రూ.7.40 కోట్లతో హైడ్రా అభివృద్ధి చేసింది. 5 ఎకరాల 12 గుంటల్లో ఉన్న బతుకమ్మ కుంట చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు– చేసింది. ఇక్కడ 14 ఎకరాల 6 గుంటల్లో బతుకమ్మ కుంట ఉండగా, అప్పట్లో బఫర్ జోన్ తో కలిపి 16 ఎకరాల13 గుంటలు ఉండేది. క్రమంగా ఆక్రమణలకు గురికాగా, తాజాగా హైడ్రా నిర్వహించిన సర్వే ప్రకారం 5 ఎకరాల 15 గుంటలు ఉన్నట్లు– గుర్తించి ఈ స్థలంలో చెరువుని అభివృద్ధి చేసింది. ఈ ఏడాది బతుకమ్మ పండుగ ఉత్సవాలు ఇక్కడే నిర్వహిస్తామని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

## పేదల ఇళ్లపై బుల్డోజర్లు


- కాంగ్రెస్‌ను నమ్మినందుకు నిండా మునిగారు
- బీఆర్ఎస్ అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్య



**హైదరాబాద్, సెప్టెంబర్ 22:** పేదల ఇళ్లను కూల్చివేస్తోందని కాంగ్రెస్ ప్రభుత్వంపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. పేదలు కట్టుకున్న గూళ్లను కూల్చేస్తే వారు ఎక్కడికి పోతారని ప్రశ్నించారు. తాజా కూల్చివేతలపై ఆయన మండిపడ్డారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెలవు రోజుల్లో కూల్చివేతలు చేయవద్దని హైకోర్టు స్పష్టంగా చెప్పిందని గుర్తు చేశారు. కానీ ఆదివారం, సెలవు రోజునే గాజులరామారంలో పేదల ఇళ్లు కూల్చారని విమర్శించారు. "కాంగ్రెస్‌కు ఓటు వేస్తే... బుల్డోజర్ రాజ్యానికి లైసెన్స్ ఇచ్చినట్లే," అని వ్యాఖ్యానించారు. హైడ్రా బుల్డోజర్ పేదల ఇళ్లపైనే వెళ్తుందని, పెద్దల ఇళ్లకు వెళ్లదని ఆరోపించారు. భారత రాష్ట్ర సమితి కార్యకర్త సర్దార్ ఇంటిని ప్రభుత్వం కూల్చివేసిందని, ఆయనకు మళ్లీ ఇల్లు నిర్మించి ఇచ్చే బాధ్యత నాదేనని కేటీఆర్ అన్నారు. "నిన్న మోదీ హెచ్1బీ వీసా గురించి మాట్లాడతారని ఆశించాం. కానీ దాని గురించి మాట్లాడకుండా జీఎస్టీ పండగ అని చెప్పారు. నిన్నటి వరకు రక్తం తాగి... ఇప్పుడు పండగ చేసుకో అంటున్నారు," అని ఎద్దేవా చేశారు. జీఎస్టీ పేరిట 8 ఏళ్లపాటు ప్రజల నుంచి ఎంతో భారం వేశారు అని విమర్శించారు. "మోదీ గతంలో చెప్పినట్టు ప్రజలందరికీ రూ.15 లక్షలు ఇచ్చితే అప్పుడు నిజంగా పండగ చేసుకుంటాం," అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

## నగరంలో మరోమారు కుంభవృష్టి

- భారీ వర్షంతో తల్లడిల్లిన రాజధాని
- రోడ్లపై నిలిచిన వాననీరు - పలుచోట్ల ట్రాఫిక్ ఇబ్బందులు



**హైదరాబాద్, సెప్టెంబర్ 22 :** రాజధాని హైదరాబాద్ నగరవ్యాప్తంగా నింబస్ మేఘాలు అలుముకున్నాయి. దీంతో నగరంలో మరోసారి భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం మూడు గంటల నుంచి తేలికపాటి జల్లులు పడుతూ వచ్చి, అనంతరం జోరు వానగా మారాయి. వర్షం కారణంగా రోడ్లపై నీరు నిలిచిపోయి, వాహనదారులు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులకు గురయ్యారు. నగరంలో మరోసారి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, అక్కడక్కడా జోరుగా వానలు కురిసే అవకాశముందని చెప్పారు. బేగంపేట, సికింద్రాబాద్ పరిసరాల్లో భారీ వర్షం కురిసింది. వర్షాల నేపథ్యంలో ముందస్తు హెచ్చరికలతో జీహెచ్ఎంసీ, హైడ్రా, ట్రాఫిక్ సిబ్బందిని ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ఎల్బీనగర్, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్‌లో భారీ వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్‌నగర్, మణికొండ, గచ్చిబౌలి, హైటెక్ సిటీ, నానక్ రామ్‌గూడలో జోరు వానలు దంచికొట్టాయి. రాంనగర్, అవూరుపేట్, ఎర్రగడ్డ, బోరబండ, యూసుఫ్‌గూడ, సనత్‌నగర్, మూసాపేట్ ప్రాంతాల్లోనూ వర్షం కురిసింది. కూకట్‌పల్లి, కేబీహెచ్‌బీ, మియాపూర్ ప్రాంతాల్లో కూడా అదే స్థితి నెలకొంది. ఇవన్నీ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లాయి. అల్పపీడన ప్రభావంతో నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, అవూరుపేట్, ఖైరతాబాద్, ఎల్బీనగర్, పెద్ద అంబర్‌పేట వంటి ప్రాంతాల్లో వర్షం కారణంగా రహదారులపై నీరు నిలిచిపోయింది. ఖైరతాబాద్–రాజ్‌భవన్ రోడ్డులో మోకాలి లోతు నీరు నిలిచినట్లు, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడినట్లు అధికారులు తెలిపారు. అవూరుపేట్, పంజాగుట్ట, ఖైరతాబాద్ ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వరద నీరు నిలిచిన ప్రాంతాల్లో హైడ్రా, జీహెచ్ఎంసీ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.

### అల్పపీడన ప్రభావం

ఉత్తర ఈశాన్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉదయం అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాగల 24 గంటల్లో ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదిలి వాయువ్య బంగాళాఖాతానికి చేరుకునే అవకాశం ఉందని తెలిపింది. ఈ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా సోమవారం, మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 25న ఉత్తర బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, దీని ప్రభావంతో 25, 26 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు.

### మరో రెండు రోజులు భారీ వర్షాలు:

తెలంగాణలో మరిన్ని రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని, ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసినట్లు తెలిపింది. ఈశాన్య బంగాళాఖాతాన్ని ఆనుకుని ఉన్న మయన్మార్, దక్షిణ బంగ్లాదేశ్ తీర ప్రాంతాల నుంచి తమిళనాడును ఆనుకుని ఉన్న దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాల వరకు సముద్రమట్టానికి 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతుందని పేర్కొన్నారు. సోమవారం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ తెలిపింది. మంగళవారం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో కూడా అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని వెల్లడించింది.

జనం వార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..

# తెలంగాణ పూల జాతర!



**తెలంగాణ వ్యాప్తంగా బతుకమ్మ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలతో చెరువులన్నీ నిండి కళకళలాడుతున్నాయి. పచ్చటి పంట పొలాలతో అలరారుతున్నాయి. అలాగే తంగేడు, గునుగు, గడ్డిపూలు విరివిగా దొరకడంతో బతుకమ్మ సంబరాలు ఊరూవాడా ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి.**

ప్రభుత్వం కూడా పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందిస్తోంది. 9 రోజుల పాటు ఇక తెలంగాణ పల్లెల్లో సందడి కనిపించనుంది. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని వేనోళ్ళ చాటి చెప్పే పండుగ 'బతుకమ్మ'. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా పువ్వులనే పూజించే సంస్కృతి తెలంగాణలోనే కనిపిస్తుంది. ముఖ్యంగా స్త్రీలకు అత్యంత ఇష్టమైన పండుగగా ప్రసిద్ధి చెందింది. ఇది తెలంగాణ అస్తిత్వాన్ని చాటిచెప్పే పండుగ మాత్రమే కాదు, స్త్రీల ఔన్నత్యాన్ని ప్రపంచానికి జోరుగా చాటి చెప్పే పండుగ. ఆడపడుచులందరికీ అత్యంత విశిష్టమైన పండుగ ఇది. బతుకమ్మ పండుగ పూల జాతరను తలపిస్తుంది. ఈ పండుగ ప్రతి ఏటా సెప్టెంబర్/అక్టోబర్ నెలల్లో ఆశ్వయుజ మాస శుద్ధ పాడ్యమి నుండి ప్రారంభమవుతుంది. దీనిని 9 రోజుల పాటు ఘనంగా జరుపుకుంటారు. ఈ బతుకమ్మను 'గౌరీ పండుగ' అని కూడా అంటారు. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై, సద్దుల బతుకమ్మ వరకు రోజుకో తీరుగా ఆడి పాడే పండుగ. అనంతరంగా దసరా పండుగ వైభవంగా జరుపుకుంటారు. మహాలయ అమావాస్యతో ప్రారంభమై, దుర్గాష్టమితో ముగింపు అవుతుంది.

బతుకమ్మ పండుగ వస్తుంది అంటే? ఆడబిడ్డల హృదయాలు ఉప్పొంగుతాయి. అన్నా-చెల్లెల అనుబంధాలు, తల్లి-బిడ్డల ప్రేమానుబంధాలు వెల్లివిరుస్తాయి. ఈ పూల పండుగ కోసం ఎదురు చూస్తూ, అత్తగారింట్లో ఉన్న ఆడపిల్లలు తమ పుట్టింటికి, అంటే సొంత ఊర్లకు రావడం అనవాయితీగా, సాంప్రదాయబద్ధంగా జరుగుతూ వస్తోంది. బతుకమ్మకు సంబంధించి ఎంతో చారిత్రక నేపథ్యం కలిగిన కథలు మనకు దొరుకుతాయి. తెలంగాణ నేలపై బతుకమ్మ పండుగను శతాబ్దాలుగా జరుపుకుంటున్నారు. ఈ పండుగ సంప్రదాయం ఎలా మొదలైందో చెప్పడానికి ఎన్నో చారిత్రక కథలు ప్రచారంలో ఉన్నాయి. ఒకప్పుడు నవాబులు, భూస్వాములు, పెత్తందారీ విధానాలతో నలిగిపోయిన తెలంగాణ గ్రామీణ సమాజంలో మహిళల బతుకులు దుర్భరంగా ఉండేవి. వారి ఆకృత్యాలకు తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్న వారిని తలచుకుంటూ తోటి మహిళలు పూజించే వారు. అట్లా వారి ప్రతీకగా పూలను పేర్చి, "బతుకమ్మ... బతుకమ్మ..." అంటూ జీవిస్తూ ఉండాలని పాడేవారు. ఇలా మొదలైందని కొందరు చెబుతారు. కానీ చారిత్రకంగా చూస్తే, చోళ రాజుల కాలంలో వేములవాడ నుండి శివలింగాన్ని పార్వతిదేవి నుండి వేరు చేసి తమిళనాడులోని తంజావూరుకు తరలించడం జరిగిందని, దానితో తెలంగాణ ప్రజల మనసు కలచివేసిందని అంటారు. పార్వతిదేవి రూపమైన బృహదమ్మ (బృహద్‌అమ్మ) నుండి శివలింగాన్ని వేరు చేసినందుకు తమ దుఃఖాన్ని చోళ రాజులకు తెలియజేస్తూ, మేరు పర్వతంలా పూలను పేర్చి బతుకమ్మను ఆడటం మొదలయ్యిందని, అట్లా ఆడపడుచులు తమ భావోద్వేగాలను పాటల రూపంలో ఆడిపాడుతూ బతుకమ్మను కొలుస్తూ ఉండేవారని చెబుతారు. 'బృహదమ్మ' అనే పేరే చివరికి 'బతుకమ్మ'గా మారిందని, సుమారు వెయ్యి సంవత్సరాలుగా ఈ పండుగ సాంప్రదా యబద్ధంగా జరుపుకుంటున్నట్టు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి.

ఇంకొక పౌరాణిక కథ కూడా ప్రచారంలో ఉంది. చోళ రాజు ధర్మాంగదునికి సంతానం ఉండదు. అనేక నోములు, వ్రతాలు చేసిన తర్వాత ఆయన భార్యకు నూరుగురు పుత్రులు జన్మిస్తారు. కానీ, వారు యుద్ధాలలో ప్రాణాలు కోల్పోతారు. ఆ రాజదంపతులు తీరని దుఃఖంతో లక్ష్మీదేవిని ఆరాధిస్తారు. ఆమెను తమ కడుపున పుట్టమని వేడుకుంటారు. ఆమె కుమార్తెగా జన్మిస్తుంది. మునులు వచ్చి ఆమెను "నిండు నూరేళ్లు బతుకమ్మా!" అని దీవిస్తారు. అందుకే లక్ష్మీదేవే 'బతుకమ్మ'గా పిలవబడుతుందని చెబుతారు. అదే సమయంలో మహావిష్ణువు చక్రాంకుడనే రాజుగా జన్మిస్తాడు. అతనే బతుకమ్మను పెళ్లి చేసుకుంటాడు. అప్పుడు నుంచి ప్రజలు లక్ష్మీదేవి అవతారంగా బతుకమ్మను పూలతో అలంకరించి పూజిస్తూ పండుగ జరుపుకుంటున్నారని చెబుతారు. అలాగే బతుకమ్మ పుట్టుకకు సంబంధించి మరొక జానపద కథ కూడా ప్రచారంలో ఉంది. ఓ రైతుకు ఏడో సంతానంగా ఆడపిల్ల పుడుతుంది. అంతకు ముందు పుట్టిన ఆరుగురు ఆడపిల్లలు ఏవో కారణాలతో చనిపోతారు. అందుకే ఈమెను 'బతుకిన అమ్మ'గా భావిస్తారు. ఆమె పేరే బతుకమ్మగా స్థిరపడుతుంది. ఆమెకు ఒక్క అన్న మాత్రమే ఉంటాడు. అతనికి చెల్లెలంటే పంచప్రాణాలు. బతుకమ్మ పెళ్లి కాగానే అత్తగారింటికి వెళ్తుంది. భర్త ఆమెను బాగా చూసుకుంటాడు. కానీ పుట్టింటికి వచ్చిన సమయంలో వదిన, బతుకమ్మ పట్ల అన్న చూపించే ప్రేమను తట్టుకోలేక అసూయపడుతుంది. చివరకు బతుకమ్మను చంపేందుకు ప్రయత్నిస్తుంది. అన్న ఊరికి వెళ్లిన సమయాన్ని వాడుకొని, వదిన బతుకమ్మను చెరువు వద్దకు తీసుకెళ్తుంది. అవకాశం చూసి బతుకమ్మ గొంతు పిసికి చంపేస్తుంది. అక్కడే ఒక గొయ్యి తీసి పాతిపెడుతుంది. అదే రాత్రి బతుకమ్మ తన అన్నకు కలలో వచ్చి విషయమంతా చెబుతుంది. తాను చెరువు కట్టపై తంగేడు చెట్టుగా పుట్టానని, వెంటనే వచ్చి తీసుకెళ్లమని వేడుకుంటుంది. ఇలా ఇంకా బతుకమ్మ పుట్టుక గురించి అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. బతుకమ్మ పండుగ ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమవుతుంది. బతుకమ్మను పేర్చిన తర్వాత, చివరగా మధ్యలో పసుపుతో గౌరమ్మను తయారుచేసి, ఆ బతుకమ్మను దేవుని వద్ద పెడతారు. బతుకమ్మకు పూజలు చేసి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి, బయటకు తీసే ముందు ఆ ఇంటి ఆడపడుచులు బతుకమ్మను తలవూడగానీ, చేతులతో పట్టుకొని ఇంటి ముందు నిలబడ్డాక కొబ్బరి కొట్టి, కాళ్లకు నీళ్లు పోసి, డప్పు చప్పుళ్లతో ఊర్లోని దేవాలయం ప్రాంగణం లేక వెడల్పుగా ఉండే చావిడికి సమూహంగా వెళతారు. అక్కడ చేరుకున్న మహిళలు రంగురంగుల బతుకమ్మలను ఒకచోట ఉంచి, తిరొక్క పాటలతో చుట్టూ వలయాకారంగా తిరుగుతూ పాటలు పాడుతూ ఆడతారు.

బతుకమ్మ అంటేనే ఓ రంగుల కల. పూల పండుగ. ఆడపడుచుల జానపద పాటలు, కోలాటం పాటలు, ఉయ్యాల పాటలు - ఇలా ప్రతి పాట సాంస్కృతిక వైభవాన్ని తరతరాలకు తెలియజేస్తుంది. పట్టు పీతాంబరాలు, పట్టుపరికిణీలు ధరించి, ఆడబిడ్డలు అంగరంగ వైభవంగా ఎనిమిది రోజుల పాటు ఘనంగా ఆడతారు. ఇది ఒక మురిపాల పండుగ. తమ కష్టాలను, సుఖాలను పాటల రూపంలో వ్యక్తం చేయడం వల్ల తమ హృదయాంతరాల్లో దాక్కున్న భావోద్వేగాలు వెలువడి, ఎంతో ఆనందం కలుగుతుంది. గ్రామీణ సౌందర్యాన్ని, కుటుంబ అనుబంధాన్ని తెలిపే అనేక పాటలు తెలంగాణ ప్రాంత విశిష్టతను, సుఖదుఃఖాలను, ఆడబిడ్డల మనోభావాలను ప్రతిబింబిస్తాయి.

# ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రోత్సవాలు

## తొలిరోజు బాలా త్రిపురసుందరిగా అమ్మవారు

విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. కనకదుర్గమ్మ తొలిరోజు శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. సనాతన ధర్మ సంప్రదాయంలో శక్తి ఆరాధనకు ప్రత్యేక స్థానం ఉంది. ఆ శక్తి రూపాల్లో అత్యంత పవిత్రం.. శ్రీ బాలా త్రిపురసుందరి దేవి. అమ్మవారు శ్రీ విద్యా ఉపాసనలో బాలరూపిణి తల్లి స్వరూపంగా, విశ్వాన్ని కాపాడే కరుణామయి శక్తిగా ఆరాధించబడుతున్నారు.

**అమ్మవారి రూపం బాలిక వలె సుందరంగా ఉండటమే కాక, ఆ రూపంలో అంతులేని దైవ గాంభీర్యం నిక్షిప్తమై ఉంటుంది. త్రిపురసుందరి అనే పదమే మూడు లోకాలను తన సౌందర్యం, శక్తి, కరుణతో ఆకర్షించే తల్లిని సూచిస్తుంది. భక్తుల జీవితంలో సౌఖ్యం, ఐశ్వర్యం, జ్ఞానం ప్రసాదించడమే ఈ అమ్మవారి అవతారం లక్ష్యం. ప్రత్యేకంగా బాలరూపంలో దర్శనమివ్వడం ద్వారా నిర్దోషత్వం, పావిత్య్రం, సులభ సాంద్రతను మానవాళికి బోధిస్తుందని పురాణాలు చెబుతున్నాయి.**



బాలా త్రిపురసుందరి దేవి చిన్న వయసులోనూ సర్వజ్ఞత, సర్వశక్తులను కలిగి ఉన్న దివ్యరూపిణి. బాలా త్రిపురసుందరి దేవిని ఆరాధించడం ద్వారా.. విద్యా, బుద్ధి, వాక్చాతుర్యం లభిస్తాయని.. జీవితంలో అడ్డంకులు తొలగిపోతాయని.. కుటుంబంలో సౌఖ్యం, శాంతి నెలకొంటుందని.. ఆధ్యాత్మిక సాధనలో ఉన్నవారికి సత్వర సాఫల్యం వస్తుందని భక్తుల విశ్వాసం.బాలా త్రిపురసుందరి రూపం మనకు ఒక శాశ్వత సందేశం ఇస్తుంది. శక్తి వయసుతో కాక, ఆత్మస్వరూపంతో నిర్ణయించబడుతుంది. చిన్నారి రూపంలోనూ మహా శక్తి దాగి ఉంటుందని తల్లి చూపిస్తుంది. ఇది మానవునికి వినయం, పావిత్ర్యం, శక్తి ఈ మూడు ఒకేసారి ఎలా కలిసివుండగలవో బోధిస్తుంది. భక్తుల హృదయాలను ఆకర్షిస్తూ, కరుణాస్వరూపిణిగా కాపాడే బాలా త్రిపురసుందరి దేవి ఆరాధన, నేటికీ విశేషంగా కొనసాగుతోంది. ఆమె అవతారం భక్తులకు ఆధ్యాత్మిక శక్తిని అందించడమే కాక, నిత్యజీవితంలో సౌభాగ్యానికి మార్గదర్శకంగా నిలుస్తోంది. ఇకపోతే అమ్మవారికి పూలతో అర్చన చేయడం ఆనవాయితీ. నవరాత్రి సమయంలో దుర్గాదేవికి ఎర్ర మందార పువ్వులను అర్పిస్తారు. ఎందుకంటే ఎరుపు రంగు ధైర్యం, బలం, శక్తిని సూచిస్తుంది. మందారాన్ని దుర్గాదేవికి ఇష్టమైన పువ్వుగా భావిస్తారు. ఇంకా, ఇది కోరికలను నెరవేరుస్తుందని, విజయం, శ్రేయస్సును తెస్తుందని నమ్ముతారు. ఎరుపు మందార పువ్వు దుర్గాదేవి ఉగ్ర శక్తిని సూచిస్తుంది. మందార పువ్వు ప్రేమ, ఆప్యాయతకు చిహ్నం, కాబట్టి దుర్గాదేవికి మందార పువ్వును సమర్పించడం ద్వారా, ఒక వ్యక్తి నిజమైన ప్రేమ, ఆనందాన్ని పొందుతాడు. అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్లలో భక్తులు భారీగా చేరుకున్నారు... పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

**ఈ పువ్వును సమర్పించడం వల్ల అమ్మవారు తమకు శక్తిని ప్రసాదిస్తారని భక్తుల నమ్మకం. దుర్గాదేవికి మందార పువ్వును సమర్పించడం ద్వారా, భక్తుల కోరికలు నెరవేరుతాయి. వారు జీవితంలో విజయం పొందుతారు. మందార పువ్వును సమర్పించడం వల్ల కుటుంబంలో ఆనందం, శ్రేయస్సు, సంపద, అదృష్టం పెరుగుతాయి. ఈ పువ్వును సమర్పించడం వల్ల ప్రతికూలత తొలగిపోతుంది. ఇంట్లోకి సానుకూల శక్తి వస్తుంది.**

# నేడు మేడారం సందర్శనకు సిఎం రాక

## ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క



**ములుగు, సెప్టెంబర్ 22 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం మేడారం సందర్శించనున్నారు. సిఎం పర్యటన నేపథ్యంలో పంచాయితి రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క మేడారంలో అభివృద్ధి పనులను పరిశీలించారు. తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క సారలమ్మ తల్లులను మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్, ఎస్పి షబరిష్ లతో కలిసి దర్శించుకున్నారు. మంగళవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సమ్మక్క సారలమ్మ దేవాలయాన్ని సందర్శించనున్న నేపథ్యంలో పర్యాటక పనులను మంత్రి సీతక్క పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు, దిశా నిర్దేశర చేశారు. ఈ సమావేశంలో ఎ ఎస్ పి శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ- చైర్మన్ రేగ కళ్యాణి, ఆర్ డిఒ వెంకటేష్, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గరావు, ఇఒ వీరస్వామి, ఎ పి ఓ వసంత రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు. సిఎం రేవంత్ పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులు భారీ ఏర్పాట్లు-చేస్తున్నారు. మేడారం మహాజాతరకు సంబంధించిన పనులకు శంకుస్థాపన, గద్దెల మార్పుపై ఫైనల్ డిజైన్ విడుదల వంటి కీలక కార్యక్రమాలు ఈ సందర్శనలో భాగంగా ఉన్నాయి. మంత్రి సీతక్క ఈ సందర్భంగా పలు శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎం పర్యటనలో ఎలాంటి లోటు-పాట్లు- లేకుండా చూడాలని, ప్రతి విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పర్యటన సజావుగా సాగేలా భద్రత, రవాణా, ఇతర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి హెలికాప్టర్ ద్వారా మేడారం చేరుకోనున్నారు. ఆయన తొలుత సమ్మక్క-సారలమ్మ తల్లులను దర్శించుకుని, ఆ తర్వాత మేడారం మహాజాతరకు సంబంధించిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అదే సమయంలో, గద్దెల మార్పుకు సంబంధించిన ఫైనల్ డిజైన్‌ను కూడా విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమం మేడారం జాతరకు కొత్త ఒరవడిని అందించనుంది. మేడారం జాతర తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలుస్తుంది. సీఎం పర్యటన ఈ ప్రాంతంలో అభివృద్ధి, సాంస్కృతిక వారసత్వ సంరక్షణకు ఊతమిస్తుందని స్థానికులు ఆశిస్తున్నారు. ఈ సందర్భంగా జరిగే కార్యక్రమాలు రాష్ట్రంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక పర్యాటకాన్ని మరింత ప్రోత్సహించే అవకాశం ఉంది. సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో అధికారులు, స్థానిక నాయకులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్శన రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా మేడారం జాతర భక్తులకు కీలకంగా మారనుంది.



# టారిఫ్‌లపై ఎందుకు స్పందించట్లేదంటే

## రాజ్‌నాథ్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** రష్యా నుంచి ముడిచమురు కొంటున్న భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు మన ఎగుమతులపై అమెరికా 50శాతం సుంకాల భారం వేసిన సంగతి తెలిసిందే. దీనిపై ఇంతవరకు భారత్ నేరుగా స్పందించలేదు. ఈ విషయమై రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ప్రశ్న ఎదురైంది. దానికి ఆయన ఆసక్తికరమైన సమాధానం ఇచ్చారు. "అవును ప్రభుత్వం ఇంతవరకు రియాక్ట్ కాలేదు. విశాల దృక్పథం, గొప్ప మనసు ఉన్నవారు ఏ విషయంపైనైనా వెంటనే స్పందించరు" అని బదులిచ్చారు. మొరాకో పర్యటనలో ఉన్న ఆయన.. అక్కడి ప్రవాస భారతీయులతో ముచ్చటిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ శాంతియుతంగానే భారత్‌లో భాగమవుతుందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. "దానంతట అదే పీఓకే మన పరిధిలోకి వస్తుంది. ఆ దిశగా అక్కడ డిమాండ్లు ఇప్పటికే మొదలయ్యాయి. ఐదేళ్లక్రితం జమ్మూకశ్మీర్‌లో భారత సైన్యాన్ని ఉద్దేశించి కూడా నేను ఇదే విషయం చెప్పాను. ఆ ప్రాంతంపై దాడి చేసి, స్వాధీనం చేసుకోవాల్సిన అవసరం లేదని, అది మనదేనని ఆనాడు అన్నాను. మేం భారత్‌లో భాగమేనని అక్కడే ప్రజలే అంటారు. ఆ రోజు ఎంతో దూరంలో లేదు" అని రాజ్‌నాథ్ వ్యాఖ్యలు చేశారు.

# సింగరేణి కార్మికులకు దసరా బోనాంజా

- 34శాతం బోనస్ ప్రకటించిన ప్రభుత్వం
- ఒక్కో కారమికుడికి రూ.1,95,610 చెల్లింపు



**హైదరాబాద్, సెప్టెంబర్ 22 :** దసరా సందర్భంగా సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ముందుగానే బోనస్ ప్రకటించింది. లాభాల్లో 34 శాతం కార్మికు లకు పంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క వెల్లడిం చారు. ఒక్కో కార్మికుడికి బోనస్‌గా రూ.1,95,610 ఇవ్వనున్న ట్లు తెలిపారు. హైదరాబాద్‌లో పలువురు మంత్రులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ మేరకు వెల్లడించారు. కాంట్రాక్ట్ కార్మికులకూ బోనస్ చెల్లిస్తామని భట్టి తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్ ఇవ్వడం దేశ చరిత్రలోనే తొలిసారని చెప్పారు. సింగరేణి సంస్థలోని 41వేల మంది శాశ్వత ఉద్యోగులకు మొత్తంగా రూ.819 కోట్లు- బోనస్‌గా పంపిణీ చేస్తాం. 30వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులకూ రూ.5,500 చొప్పున అందజేస్తాం. కోల్ ఇండియా నుంచి వచ్చే బోనస్‌ను దీపావళికి పంపిణీ చేస్తాం. భవిష్యత్‌లోనూ సింగరేణి కార్మికులకు అండగా ఉంటాం. జీఎస్టీ మార్పుల వల్ల రాష్ట్రాలు ఆదాయం కోల్పోతున్నాయి. కోల్పోతున్న ఆదాయాన్ని కేంద్రం భర్తీ చేయాలి. ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని రాష్ట్రాలపై భారం వేయడం సరికాదు. వచ్చే ఐదేళ్లపాటు- కేంద్రం వయబులిటీ గ్యాప్ ఫండ్ ఇవ్వాలని రేవంత్‌రెడ్డి అన్నారు.

# బాసరలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

**నిర్మల్, సెప్టెంబర్ 22 :** ప్రముఖ పుణ్యక్షేత్రం బాసరలో దేవీ శరన్నవరాత్రులు సోమవారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. తొలిరోజు అమ్మవారు శైలపుత్రిగా దర్శనమిచ్చారు. చదువులతల్లి సరస్వతి దేవీ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా అక్షరాభ్యాసాలు కూడా జోరుగా సాగాయి. ఈ సందర్భంగా బాసర ఆలయానికి భక్తజనం పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే గోదావరిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. చిన్నారులకు పెద్దఎత్తున అక్షరాభ్యాసాలు చేయిస్తున్నారు. ఉదయం 5 గంటల నుంచి చిన్నారులకు అక్షరాభ్యాసాలు ప్రారంభమయ్యాయి. వేకువజాము నుంచే అమ్మవారి వేదపారాయణం నిర్వహణ చేపట్టారు. బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో శారదీయ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతాయి. రాష్ట్రం నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అటు రైల్వే స్టేషన్‌లో భక్తుల సందడి కనిపించింది. బాసర సరస్వతీ అమ్మవారిని మూల నక్షత్రంలో దర్శించుకుంటే కోరిన కోరికలు తీరుతాయని నమ్మకం.



# భద్రకాళి ఆలయంలో దేవీ శరన్నవరాత్రులు

**వరంగల్, సెప్టెంబర్ 22 :** వరంగల్ భద్రకాళి అమ్మవారి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రులు గనంగా ప్రారంభం అయ్యాయి. తొలిరోజు బాలా త్రిపురసుందరీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు చేసి దర్శనానికి అనుమతించారు. నవరాత్రులను పురస్కరించుకొని వరంగల్‌లోని శ్రీ భద్రకాళీ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సోమవారం ఉదయం నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. భక్తుల రాకతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

జనం వార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..
మంగళవారం 23 సెప్టెంబర్ 2025


# జీఎస్టీ సంస్కరణలు భవిష్యత్‌లో గేమ్ ఛేంజర్

**మేడిన్ ఇండియా మరింత బలోపేతం**

**స్వదేశీ వస్తువులనే వినియోగించాలి**

**జిఎస్టీ లాభాలపై కరపత్రాలతో ఇంటింటి ప్రచారం**

**అసెంబ్లీలో వెల్లడించిన సిఎం చంద్రబాబు నాయుడు**



**అమరావతి, సెప్టెంబర్ 22:** జీఎస్టీ సంస్కరణల తో మేడిన్ ఇండియా మరింత బలోపేతం అవుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. బలమైన, సమతుల్యమైన సమాజ నిర్మాణమే లక్ష్యమని ఉద్ఘాటించారు. జీఎస్టీ సంస్కరణలతో ఏపీ ప్రజలకు రూ.8వేల కోట్ల లాభం వస్తుందని తెలిపారు. స్వదేశీ, మేకిన్ ఇండియా ప్రచారం మరింత ఊపందుకోవాలని సూచించారు. సోమవారం జీఎస్టీ సంస్కరణలపై ఏపీ అసెంబ్లీలో సీఎం చంద్రబాబు మాట్లాడారు . గృహోపయోగ వస్తువుల వినియోగం బాగా పెరుగుతోందని చెప్పుకొచ్చారు. దేశీయ ఉత్పత్తులు కొనాలని.. దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని దిశానిర్దేశం చేశారు. దసరా నుంచి దీపావళి వరకు జీఎస్టీ ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. నాలుగు వారాల్లో జీఎస్టీపై 65 సమావేశాలు ఏపీలో నిర్వహిస్తామని వెల్లడించారు. జీఎస్టీ సంస్కరణలు భవిష్యత్‌లో గేమ్ ఛేంజర్ అని ఉద్ఘాటించారు. జీఎస్టీ సంస్కరణలతో ప్రజల జీవితాల్లో అనేక మార్పులు వస్తాయని చెప్పుకొచ్చారు. స్వర్ణాంధ్ర దిశగా ముందుకెళ్లేందుకు జీఎస్టీ సంస్కరణలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. జీఎస్టీపై ఓ యాక్షన్ ప్లాన్ రూపొందిస్తాం. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ అని ప్రధానమంత్రి నరేంద్ మోదీ చెప్పారు. జీఎస్టీ ఫలితాలు పేదలకు అన్నివర్గాల స్టేక్ హోల్డర్‌లకు చేర్చాలి. దీనికి 30 రోజులు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. దీని అమలుకు ఒక కమిటీ వేశాం. హెచ్‌ఆర్డీ మంత్రి లోకేష్ , ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, హోంమంత్రి వంగలపూడి అనిత, టూరిజం మంత్రి కందుల దుర్గేష్‌లతో ఈ కమిటీ వేశాం. జీఎస్టీ సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థలో కొత్త దశకు నాంది పలుకుతున్నాయని ప్రధాని మోదీ అన్నారు. ఏపీకి సంబంధించి ప్రగతిశీల విధానాల ద్వారా పేదల, మధ్యతరగతి జీవితాలను మార్చాలి. దీనికి సూపర్ జీఎస్టీ, సూపర్ సిక్స్, పీ4లు ఏపీని స్వర్ణాంధ్ర వైపు నడిపిస్తాయి. ప్రతి ఒక్కరికి, ప్రతి ఇంటికి బెనిఫిట్ వస్తుంది. మన రాష్ట్రానికి రూ.8వేల కోట్ల లబ్ధి ఉంటుంది. చిన్న వ్యాపారులకు ప్రయోజనం కలుగుతుంది. ఎంఎస్ఎంఈలకు ఊపు వస్తుంది. మేక్ ఇన్ ఇండియాకు దోహదం చేస్తుంది. మన బ్రాండ్‌లు అంతర్జాతీయ బ్రాండ్‌లు అవుతాయి. సెల్ఫ్ రిలయంట్ ఎకానమీకి ఇది దోహదం చేస్తుంది. భారతీయ ఉత్పత్తులను కొంటే అది కేవలం ఒక లావాదేవి మాత్రమే కాదు అది మన సమాజ అభివృద్ధికి హామీ'అని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు.. ఇంటింటికీ జీఎస్టీ కరపత్రాలు తీసుకెళ్లి అగ్రికల్చర్, ఇతర అంశాల్లో ఎలా లబ్ధి కలుగుతుందో వివరిస్తాం. జీఎస్టీ సవరణలతో డిజిటల్ ఇండియా, డిజిటల్ ఆంధ్రప్రదేశ్ సాధ్యం. చాలా వరకూ 15వేల గ్రామ సచివాలయాల్లో మీటింగ్‌లు పెట్టి అందరిని ఇన్వాల్వ్ చేస్తాం. 10వేల రైతు సేవా కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తాం. అక్టోబర్ 7, 8 తేదీల్లో విద్యాసంస్థల్లో జీఎస్టీ గురించి వివరిస్తాం. అక్టోబర్ 9న విలేజ్ హెల్త్ సెంటర్‌లు, వెల్ నెస్ సెంటర్‌లలో కార్యక్రమం నిర్వహిస్తాం. బిల్డింగ్ వర్కర్‌లు, అక్టోబర్ 11న 850 సెంటర్లలో కార్యక్రమం నిర్వహిస్తాం. అక్టోబర్ 16న ట్రాన్స్‌పోర్టు లాజిస్టిక్స్ , 200 ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహిస్తాం. లాస్ట్ వన్ వీక్‌లో షాపింగ్ అండ్ కల్చరల్ ప్రోగ్రాంలు నిర్వహిస్తాం. విలేజ్ సెక్రటేరియట్, రైతు సేవాకేంద్రాల్లో ఎక్కడికక్కడ ఒక్కొక్కరిని ఏర్పాటుచేసి ప్రజల్లోకి తీసుకెళ్తాం. మీడియా, హోర్డింగ్స్ , ఇంటర్వ్యూలు ఇవ్వడం, పాడ్ కాస్ట్‌లు ఇంటర్వ్యూలు, సెలబ్రిటీలతో మాట్లాడించి అన్ని చేస్తాం. ఎమ్మెల్యేలు ఇచ్చే అంశాలను కూడా మంత్రి వర్గ ఉపసంఘం ఇక్లూడ్ చేస్తుంది. శాండ్ ఆర్ట్ ఇన్ ఏపీ బీచెస్ నిర్వహిస్తాం. ఈ సంవత్సరం బ్రహ్మాండంగా ఆనందంగా పండుగలను ప్రజలు చేసుకోవాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## జిఎస్‌టి తగ్గింపు సామాన్య ప్రజలకు వరం : జూపల్లి

**ప్రధాని మోడీకి ధన్యవాదాలు తెలిపిన బిజెపి నాయకులు జూపల్లి నరేష్**



**నాగారం, సెప్టెంబర్ 22 (జనంవార్త) :** సామాన్య, మధ్యతరగతి ప్రజలకు పండుగ బోనస్ గా దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జి.ఎస్.టిని తగ్గించినందుకు నాగారం మున్సిపల్ బిజెపి సీనియర్ నాయకులు జూపల్లి నరేష్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలు నుండి టీవీ,కారు తదితర 400 వస్తువుల ధరలు కేంద్ర ప్రభుత్వం తగ్గింపుకు జి.ఎస్.టి అమలు చేసి మోడీ ప్రజల గుండెల్లో నిలిచిపోయారని అన్నారు.సామాన్య ప్రజలకు ఖర్చుల భారం తగ్గించేందుకు ప్రభుత్వం జి.స్.టి రేట్లను సెప్టెంబర్ నేటి నుండే అమలు చేయాలని నిర్ణయం తీసుకుందన్నారు. జిఎస్ టి తగ్గింపుతో తగ్గే వస్తువుల ధరలు పాలు,వెన్న,నెయ్యి,వెన్న నూనె,పాల,(చీజ్), పనీర్, రోటీ, చపాతీ, పాపడ్, పాస్తా, నూడుల్స్, కౌస్కాస్, పేస్ట్రీలు, కేకులు, బిస్కెట్లు, కార్న్ ఫ్లెక్స్, స్టీల్ గిన్నెలు, మీక్షర్ మసాలా పొడి, టీ, కాఫీ పౌడర్, జామ్, కొబ్బరి నీళ్ల,టూత్ బ్రష్, టూత్‌పేస్ట్, సబ్బు, షాంపూ, హెయిర్ ఆయిల్, షేవింగ్ క్రీమ్, పరోటా బ్రెడ్, డ్రై ఫ్రూట్స్ ఖర్జూరాలు, అంజూర పండ్లు, పైనాపిల్,అవకాడో, మామిడి, నారింజ, ద్రాక్షపండు, నిమ్మకాయలు, చింతపండు, చక్కెర, స్వీట్స్, చాక్లెట్ కూరగాయలు తదితర నిత్యవసర వస్తువులపై బరువు తగ్గించినందుకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.



## ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి సందడి

**అమ్మవారిని దర్శించుకున్న మంత్రులు**

**20లక్షల మంది వస్తారని అంచనా**

**హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడి**

**విజయవాడ, సెప్టెంబర్ 22 :** ఈ ఏడాది దుర్గమ్మ దర్శనానికి సుమారు 20 లక్షల మంది వస్తారని అంచనా వేసినట్లు హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. సోమవారం దసరా ఉత్సవాల తొలిరోజు కావడంతో విజయవాడ నగరంలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఎపి మంత్రులు వంగలపూడి అనిత, ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే సుజనా చౌదరి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్‌బాబు, తదితరులు దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దర్శనం అనంతరం అనిత మీడియాతో మాట్లాడుతూ ... తెలుగు ప్రజలందరికీ ఆమె దసరా ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. అంగరంగ వైభవంగా అమ్మవారి దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయన్నారు. జనాల కోసం తగిన ఏర్పాట్లు చేశామని, మొత్తం 36 విభాగాల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేశారని, 4,500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు. గతేడాది దసరా నవరాత్రుల్లో 13 లక్షల మంది ప్రజలు దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ ఏడాది సుమారు 20 లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నాం. వీఐపీలకు ప్రత్యేక స్లాట్ ఏర్పాటు చేశాం.. ఆ సమయంలో వారు దర్శనం చేసుకుంటారు. వీఐపీ యాత్రికులు దర్శనానికి వచ్చినా.. సామాన్యులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశాం. వైద్య సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచాం. స్త్రీ శక్తి పథకం వల్ల ఉచిత బస్సుల్లో చాలా మంది మహిళలు వస్తారని ఆశిస్తున్నాం. రాబోయే సంవత్సరాల్లోనూ రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్డీయే ప్రభుత్వమే ఉండాలని అమ్మవారిని కోరుకున్నా. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు శక్తిని, యుక్తిని, ధైర్యాన్ని ఇవ్వాలని వేడుకున్నా. రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించానని అనిత తెలిపారు.




## అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్

**ఐబీఎం, టీసీఎస్ వంటి సంస్థలు వస్తున్నాయి: బాబు**

**విశాఖపట్టణం, సెప్టెంబర్ 22 :** సంకల్పం ఉంటే మంచి పనులు ఎన్ని అయినా చేయవచ్చని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. విశాఖలో 28వ ఈగవర్నెన్స్ జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. డిజిటల్ ఏపీ సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భగా చంద్రబాబు మాట్లాడుతూ..

ప్రముఖ సంస్థల సహకారంతోనే అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ ఏర్పాటు చేస్తున్నాం. ఐబీఎం, టీసీఎస్ వంటి సంస్థలు వస్తున్నాయి. క్వాంటమ్ టెక్నాలజీపై మరింత దృష్టి పెడుతున్నాం అని చంద్రబాబు తెలిపారు. సరైన సమయంలో సరైన నాయకుడిగా ప్రధాని మోదీ వచ్చారు. ప్రజలకు మేలు జరిగే నూతన సంస్కరణలు తీసుకొచ్చారు. సాంకేతికతకు అనుగుణంగా మనమూ మారాల్సిన అవసరముందన్నారు. ఇవాళ ప్రజలకు అన్ని సేవలు ఆన్‌లైన్‌లోనే అందుబాటులోకి వచ్చాయి. ఐటీ రంగంలో భారతీయులకు చాలా నైపుణ్యం ఉంది. నాలెడ్జ్ ఎకానమీకి ఆనాడు ప్రాధాన్యం ఇవ్వడం వల్లే హైదరాబాద్‌కు మేలు జరిగింది.

తలసరి ఆదాయంలో తెలంగాణ ప్రముఖంగా మారింది. ఇవాళ ప్రపంచంలో ఎక్కడ చూసినా భారతీయులే ఉన్నారు. ఐటీ సంస్థల్లో పనిచేస్తున్న భారతీయుల్లో దాదాపు 30 శాతం ఏపీ వారే. ప్రపంచంలోని నలుగురు ఐటీ నిపుణుల్లో ఒకరు భారత్‌కు చెందినవారు ఉన్నారు. భారతీయ ఐటీ నిపుణులు ప్రతి నలుగురిలో ఒకరు ఏపీకి చెందినవారే కావడం విశేషం.



## మంత్రి శ్రీధర్ బాబును కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే

**భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుకు నిధులు కేటాయించాలని వినతి**

**ఉప్పల్, సెప్టెంబర్ 22 (జనం వార్త) :** భారీ వర్షాల కారణంగా చర్లపల్లి డివిజన్ పరిధిలో పలు కాలనీలు ముంపుకు గురికాకుండా తక్షణ చర్యలు చేపట్టలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోమవారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబును కలిసి విన్నవించారు.చర్లపల్లి డివిజన్ పరిధిలో ఎడతెరిపిలేని భారీ వర్షాల కారణంగా కాలనీలు ముంపుకు గురికాకుండా తక్షణ చర్యలు చేపట్టలని, అక్కడి ప్రజల సమస్యల మంత్రికి వివరించారు. చర్లపల్లి డివిజన్ పరిధి లో ఇటీవలి భారీ వర్షాల వలన సాయి నగర్, కృష్ణారెడ్డి నగర్, కుషాయిగూడ, నాగార్జున నగర్, శుభోదయ కాలనీల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. భారీ వర్షాలకు ధ్వంసమైన రోడ్ల మరమ్మతుకు నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంత్రికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు నేమూరి మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రి శరన్నవరాత్రికి భారీగా ఏర్పాటు

**యాప్‌ను ఉపయోగించుకోవాలన్న ఇవో**

**విజయవాడ, సెప్టెంబర్ 22 :** విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో దసరా ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం అయ్యాయి. సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2 వరకూ జరిగే ఈ వేడుకలకు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశ విదేశాల నుంచి కనీసం 18 లక్షల మంది భక్తులు రావొచ్చని అధికారుల అంచనా. 11 రోజుల్లో.. 11 రూపాల్లో అమ్మవారు దర్శనమిస్తారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అధికారులు పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది వేడుకల నిర్వహణలో సాంకేతికతను పెద్దఎత్తున వినియోగిస్తున్నట్లు ఆలయ ఈవో వి.కె.శీనానాయక్ తెలిపారు. దసరా2025 యాప్‌ను అందుబాటులోకి తెచ్చామని, భక్తులు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. మూలా నక్షత్రం సందర్భంగా సెప్టెంబరు 29న సోమవారం సరస్వతీ దేవి రూపంలో దర్శనమిచ్చే దుర్గమ్మను ముఖ్యమంత్రి చంద్రబాబు మధ్యాహ్నం 3.30 నుంచి 4.30 గంటల మధ్యలో దర్శించుకుంటారు. అదేరోజు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అమ్మవారు సోమవారం బాలా త్రిపురసుందరీ దేవి రూపంలో దర్శనమిచ్చారు. మొదటి రోజు భక్తులను ఉదయం 9 నుంచి రాత్రి 11 గంటల వరకు దర్శనాలకు అనుమతించారు. రెండో రోజు నుంచి తెల్లవారుజామున 4 గంటల నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకోవచ్చు. భక్తుల కొంగుబంగారమైన విజయవాడ కనకదుర్గమ్మకు 12 రకాల మంగళసూత్రాలున్నాయి.

వీటిని దసరా సహా ఇతర ఉత్సవాల సమయంలో అలంకరిస్తుంటారు. అమ్మవారి మూల విరాట్‌తోపాటు కల్యాణమూర్తులకు వీటిని అలంకరించి వేడుకలు నిర్వహిస్తుంటారు. ఉత్సవాల సమయంలో మాత్రమే వీటిని బయటకు తీసి.. మిగతా సమయాల్లో బ్యాంకు లాకరులో భద్రపరుస్తారు. తాజాగా దసరా వేళ దుర్గమ్మ 11 రోజుల్లో 11 రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారు. ఒక్కో అలంకారాన్ని బట్టి.. ఆభరణాలతో పాటు ఈ మంగళసూత్రాలను ధరింపజేస్తారు.

## మహారాష్ట్ర, యూపిలను మించాలి

**ఆదాయం వచ్చే పంటలకు ప్రోత్సాహం**

**25 లక్షల హెక్టార్లకు హార్టికల్చర్ పెంపు**

**వ్యవసాయరంగపై చర్చలో సిఎం చంద్రబాబు**

**వ్యవసాయాన్ని జగన్ నిర్లక్ష్యం చేశారన్న అచ్చన్నాయుడు**

**అమరావతి, సెప్టెంబర్ 22 :** ఆదాయం వచ్చే పంటలు వేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అరటి, మిరప, మామిడి, పూలు, టమాటో, బత్తాయి, ఆయిల్‌పామ్, మిరియాలు, నిమ్మ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. వచ్చే ఐదేళ్లలో హార్టీకల్చర్‌ను 25 లక్షల హెక్టార్లకు పెంచేలా చర్యలు చేపట్టామని చెప్పారు. మరో పదేళ్లలో మహారాష్ట్ర, యూపీని అధిగమించి.. ఏపీ నెంబర్‌వన్ కావాలని ఆకాక్షించారు. వ్యవసాయరంగంపై సిఎం చంద్రబాబు అసెంబ్లీలో మాట్లాడారు. రాష్ట్రంలో 18 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారని సీఎం చెప్పుకొచ్చారు. ఏపీ అసెంబ్లీలో జీఎస్టీ సంస్కరణల పై మాట్లాడిన అనంతరం వ్యవసాయంపై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా మాట్లాడారు. రాష్ట్రానికి 41 శాతం ఆదాయం సేవారంగం నుంచి వస్తుంది. ఆదాయం వచ్చే పంటలు వేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నాం. పశుసంపదపై 19 లక్షల కుటుంబాలు ఆధారపడ్డాయి. పాలు, మాంసం, గుడ్ల ఉత్పత్తి మరింత పెరగాలి. స్వయం సహాయక సంఘాల మహిళల ఆదాయం పెంచుతున్నాం. 157 గోకులాలు వస్తున్నాయి, పశువులకు హాస్టళ్లు తెస్తున్నాం. గోకులాలకు గడ్డి కూడా సరఫరా చేస్తాం. రాష్ట్రంలో 18 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. రాయలసీమలో హార్టీకల్చర్, మైక్రో ఇరిగేషన్ రావాలనేది నా ఆకాంక్ష. హార్టీకల్చర్‌లో 21 శాతం వృద్ధి రేటు సాధించాం. హార్టీకల్చర్ అభివృద్ధి పై మా ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనం. అరటి, మిరప, మామిడి, పూలు, టమాటో, బత్తాయి, ఆయిల్‌పామ్, మిరియాలు, నిమ్మ సాగును ప్రోత్సహిస్తున్నాం. వచ్చే ఐదేళ్లలో హార్టీకల్చర్‌ను 25 లక్షల హెక్టార్లకు పెంచేలా చర్యలు తీసుకు న్నాం. మరో పదేళ్లలో మహారాష్ట్ర, యూపీని అధిగమించి మనం నెంబర్‌వన్ కావాలి' అని సీఎం అన్నారు. అసెంబ్లీలో వ్యవసాయ రంగంపై స్వల్పకాలిక చర్చ జరిగింది. సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమాధానం ఇచ్చారు. ఏపీలో ఎరువులు, యూరియా సమస్యల ను అధిగమించామని తెలిపారు. యూరియాపై రైతులకు ఎలాంటి ఆందోళన అవసరం లేదని చెప్పుకొచ్చారు. 7.86 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంచామని తెలిపారు మంత్రి అచ్చెన్నాయుడు.ఇప్పటికే 6.90 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామని స్పష్టం చేశారు. ఇంకా 97 వేల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీకి సిద్ధంగా ఉందని వెల్లడించారు. రైతు సేవా కేంద్రాల్లో 70 శాతం యూరియా పంపిణీ చేస్తున్నామని వివరించారు. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవాలని ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రబీపంటకు పైసా కూడా బీమా ఇవ్వలేదని విమర్శించారు. మళ్లీ ఇప్పుడు సిగ్గులేకుండా రైతుల గురించి జగన్ మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు మంత్రి అచ్చెన్నాయుడు.డ్రిప్, స్పిం÷-రక్లర్ల వినియోగంలో కేంద్ర ప్రభుత్వం ఏపీకి అవార్డు ఇచ్చిందని గుర్తుచేశారు. డ్రిప్, స్పిం÷-రక్లర్లు కావాలని కోరిన వారికి 24 గంటల్లోగా ఇస్తున్నామని తెలిపారు. అన్నదాతలు అనేక ప్రాంతాల్లో నానో యూరియా వాడి అధిక దిగుబడులు తెస్తున్నారని చెప్పుకొచ్చారు. ఐదేళ్లపాటు జగన్ ప్రభుత్వం వ్యవసాయశాఖను పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. గత వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయశాఖకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను రూపాయి కూడా వాడలేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర పథకాలన్నీ వాడుకుంటున్నామని ఉద్ఘాటించారు. రైతులకు అన్ని రకాలుగా మేలు చేస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవాలని ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రబీపంటకు పైసా కూడా బీమా ఇవ్వలేదని విమర్శించారు. మళ్లీ ఇప్పుడు సిగ్గు లేకుండా రైతుల గురించి జగన్ మాట్లాడుతన్నారని ధ్వజమెత్తారు మంత్రి అచ్చెన్నాయుడు.



## జ్యూవెలరీ షాప్‌ను ప్రారంభించిన ప్రేమ కుమార్

**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 22 (జనం వార్త) :** కేపిహెచ్‌బి ధర్మారెడ్డి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన జ్యూవెలరీ షాప్‌ను కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేన ఇన్ ఛార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల మన్ననలు పొందినప్పుడే వ్యా పారంలో అభివృద్ధి సాధ్యం అన్నారు. అనంతరం నిర్వాహకులు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్‌ను, వెంకటేశ్వర స్వామీజీని శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్ర మంలో జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్, పోలేబోయిన శ్రీనివాస్, పులగం సుబ్బు, యాదవ్, విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

## సామాన్య భక్తులకు దర్శన భాగ్యం

**క్యూఆర్ కోడ్ ద్వారా సమస్యలపై ఆరా**

**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**

**విజయవాడ, సెప్టెంబర్ 22 :** భక్తుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం కోసం ఏర్పాటుచేసిన క్యూఆర్ కోడ్ ద్వారా అభిప్రాయాలను... సమస్యలను తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో తొలిరోజు సోమవారం ఆయన వినాయకుని గుడి ప్రారంభం నుంచి చిన్న ఇంద్రకీలాద్రి రాజగోపురం వరకు కాలినడకన సామాన్య భక్తుల క్యూలైన్ ద్వారా నడిచి వచ్చి భక్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పసి పిల్లలకు పాల లభ్యత, మంచినీరు, పారిశుధ్య ఏర్పాట్లు వంటి అంశాలను పరిశీలించారు. 15 నిమిషాలలో తాను నడక దారిన చిన రాజగోపురం చేరుకున్నానన్నారు. సాధారణ భక్తుల సంతృప్తికర దర్శనం కోసం జిల్లా యంత్రాంగం చేసిన ఏర్పాట్లు బాగున్నాయని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఉదయం ఏడున్నర గంటలకు ప్రారంభమైన దర్శనం మధ్యాహ్నానికి 20,000 మంది పైగా దర్శనం చేసుకున్నారని తెలిపారు. భక్తులు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు పడకుండా చాలా ఆహ్లాదకర వాతావరణంలో, ఆధ్యాత్మిక వాతావరణంలో దర్శనం చేసుకుంటున్నారన్నారు. అదే సమయంలో విఐపి దర్శనాల కోసం ప్రత్యేకంగా కేటాయించిన సమయంలో మాత్రమే ప్రముఖులు కూడా వస్తూ సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఇదే రీతిన సామాన్య భక్తుల సంతృప్తికర దర్శనమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం సేవలందించాలని ఆదేశించారు.



## ఘనంగా ప్రారంభమైన దేవి నవరాత్రి ఉత్సవాలు

**బుద్వేల్ రైల్వే స్టేషన్‌లో ఆధ్యాత్మిక వాతావరణం**

**రాజేంద్రనగర్ :** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ రైల్వే స్టేషన్ కమ్యూనిటీ భవనంలో దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు బాలత్రీపుర సుందరిదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చింది. వేదపండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి పూజ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం పలువురు భక్తులు అమ్మవారి మాల ధరించారు.ఈ ఉత్సవాలు అక్టోబరు 2వ తేది వరకు ఘనంగా నిర్వహిస్తున్నామని దేవి నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మొదటి రోజు బాలాత్రిపుర సుందరిదేవి అకారంతో మొదలైన ఉత్సవాలు రెండవ రోజు గాయత్రి దేవి. అన్నపూర్ణ దేవి, శ్రీ కాత్యాయినీ దేవి, మహాలక్ష్మీదేవి, లలిత త్రిపుర సుందరి దేవి, మహా చండిదేవి, సరస్వతి దేవి, దుర్గాదేవి, మహిసాసురవమర్దిని దేవి. రాజరాజేశ్వరి దేవిగా ప్రతి రోజు అమ్మవారు పలు అవతారాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. కావున భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బస్తీపెద్దలు, యువకులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

**11 రోజులు ఆధ్యాత్మిక వాతావరణం...** నవరాత్రి ఉత్సవాలలో భక్తులు ఉపవాసాలు పాటిస్తూ, శ్లోకాలు జపిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాయంత్రాల్లో బతుకమ్మ ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. భక్తి, ఆనందం, ఆధ్యాత్మికతతో కమ్యూనిటీ భవనం పరిసరాలు సందడిగా మారనుంది.

జనం వార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..

# ఖలిస్థానీ ఉగ్రవాది ఇంద్రజీత్ సింగ్ కెనడాలో అరెస్టు



**కెనడా :** ఖలిస్థానీ ఉగ్రవాది ఇంద్రజీత్ సింగ్ గోసల్ కెనడాలో అరెస్టయ్యాడు. సిఖ్స్ ఫర్ జస్టిస్ అనే వేర్పాటువాద సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకడైన గుర్‌పత్వంత్ సింగ్ పన్నూకు అతడు సన్నిహితుడు. 2023 నుంచి గోసల్ కెనడాలో ఎస్ఎఫ్‌జే కార్యకలాపాలు చూసుకుంటున్నాడు. ఆయుధాలు కలిగిఉండటం సహా పలు అభియోగాలపై గోసల్‌ను అట్టావాలో తాజాగా అదుపులోకి తీసుకున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. గత నవంబర్‌లోనూ కెనడా పోలీసులు అతడిని అరెస్టు చేశారు. గ్రేటర్ టొరంటో ఏరియాలోని ఒక హిందూ ఆలయం వద్ద చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలో ప్రమేయం ఉందని ఆ సమయంలో ఆరోపణలు వచ్చాయి. తర్వాత షరతులతో కూడిన బెయిల్ మంజూరు అయింది. ఇదిలాఉంటే.. ద్వైపాక్షిక సంబంధాల్లో ఒక కొత్త అధ్యాయానికి తెరతీసేందుకు భారత కెనడాల మధ్య అంగీకారం కుదిరిందని ఇటీవల మన విదేశాంగ ప్రకటించింది. ఈ అంగీకారంలో భాగంగా ఉగ్రవాదం, అంతర్జాతీయ నేరాలను ఎదుర్కొనేందుకు కలిసి పనిచేయాలని నిర్ణయించినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. కాగా.. 2023లో ఒక సిక్కు వేర్పాటువాది హత్య అనంతరం ఇరు దేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం రెండు దేశాలు సంబంధాలను పునరుద్ధరించుకుంటున్నాయి. దానిలో భాగంగా భారత్, కెనడాలు ఉపసంహరించుకున్న రాయబారులను ఇటీవల తిరిగి నియమించుకున్నాయి. అనంతరం సంబంధాల పునరుద్ధరణే లక్ష్యంగా దేశ రక్షణ సలహాదారు అజిత్ దోభాల్, కెనడా భద్రతా సలహాదారు నథాలీ డ్రౌయిన్‌ల మధ్య చర్చలు జరిగాయి. జూన్‌లో కెనడాలో జరిగిన జీ7 శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ ఇరు దేశాల సంబంధాలపై అక్కడి ప్రధాని మార్క్ కార్నీతో చర్చలు జరిపిన సంగతి తెలిసిందే.

# సొంత ప్రజల పైనే బాంబుల వర్షం

## పాక్ నిర్వాకం



**పాకిస్థాన్ :** పాకిస్థాన్ వాయుసేన యుద్ధ విమానాలు ఖైబర్ పఖ్తున్‌ఖ్వాలోని ఓ గ్రామంపై దాడి చేశాయి. తెల్లవారుజామున రెండు గంటల సమయంలో ఇక్కడి తిర్హా లోయలోని మాత్రె దారా గ్రామంపై ఫైటర్ జెట్‌లు ఎల్ఎస్-6 రకం 8 బాంబులను జార విడిచాయి. దీంతో కనీసం 30 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఈ దాడిలో పెద్ద సంఖ్యలో ప్రజలు గాయపడినట్లు స్థానిక మీడియా చెబుతోంది. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు వైరల్‌గా మారాయి. మృతుల్లో పిల్లలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. సహాయక బృందాలు అక్కడికి చేరుకొని చర్యలు చేపట్టాయి. పాకిస్థాన్ చేపట్టిన ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లలో భాగంగా గతంలో ఈ ప్రావిన్స్‌లో దాడులు చేసింది. నాడు కూడా పెద్దసంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఏడాది జనవరిలో అంతకుముందు నెలతో పోలిస్తే ఉగ్రదాడులు 42 శాతం పెరిగాయి. ఈ విషయాన్ని పాక్ ఇనిస్టిట్యూట్ ఫర్ కాన్ఫ్లిక్ట్ స్టడీస్ అండ్ సెక్యూరిటీ స్టడీస్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. బలోచిస్థాన్ తర్వాత అత్యధికంగా ఉగ్రదాడులు జరిగేది ఈ ప్రావిన్స్‌లోనే.

### పంజాబ్ ప్రావిన్స్‌లో ఉగ్రవాదుల అరెస్టు..


అల్‌ఖైదా, ఐసిస్, టీటీపీ సంస్థలకు చెందిన 89 మంది ఉగ్రవాదులను పంజాబ్ ప్రావిన్స్‌లోఅరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర కౌంటర్ టెర్రరిజం డిపార్ట్‌మెంట్ సోమవారం వెల్లడించింది. గత మూడు నెలల్లో ఇంటెలిజెన్స్ ఆధారంగా 940 ఆపరేషన్లు చేసి వీరిని అరెస్టు చేశామంది. వారు ప్రావిన్స్‌లోని కీలక నగరాలు, భవనాలపై దాడులు చేసేందుకు ప్లాన్ చేసినట్లు ఆరోపించింది. 20 కేజీల పేలుడు పదార్థాలు, 85 డిటోనేటర్లు, ఫ్యూజ్ వైర్‌ను స్వాధీనం చేసుకొన్నట్లు వెల్లడించింది.

# లారీలో 300 కి.మీ. ప్రయాణించిన నాగుపాము



**అంబాలా:** లారీ క్యాబిన్‌లోకి ఎక్కిన ఏడడుగుల నాగుపాము 300 కిలోమీటర్లు ప్రయాణించింది. చివరకు లారీ డ్రైవరు దానిని గుర్తించి వన్యప్రాణి విభాగం అధికారులకు సమాచారం అందించడంతో వారు వచ్చి పట్టుకెళ్లారు. ఉత్తర్ ప్రదేశ్‌లోని గాజియాబాద్ నుంచి హరియాణాలోని అంబాలాకు లారీ వెళ్తోంది. లారీలోని దాక్కున్న కోబ్రా బుస్ అని శబ్దం చేసినా అది టైరువల్లేనని డ్రైవరు భావించారు. మధ్యలో టీ తాగడానికి ఆగిన ఆయన మళ్లీ వచ్చే సరికి డ్రైవరు సీట్లోకి నాగుపాము వచ్చింది. ఆందోళనకు గురైన ఆయన యజమానికి సమాచారం ఇచ్చారు. ఆ తర్వాత వన్యప్రాణి విభాగం అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆ నాగుపామును పట్టుకోవడానికి సిబ్బందికి 1.5 గంటల సమయం పట్టింది.

# మూడు దశల్లో బిహార్ ఎన్నికలు..?



**బిహార్ :** బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ శరవేగంగా చర్యలు తీసుకొంటోంది. ఛట్ పూజ వేడుకల తర్వాత పోలింగ్ నిర్వహించవచ్చని ఆంగ్ల పత్రికల్లో కథనాలు వెలువడుతున్నాయి. నవంబర్ 22వ తేదీతో బిహార్ అసెంబ్లీ గడువు ముగుస్తుంది. ఆ లోపే ఈ ఎన్నిక జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఇండియా టుడే కథనం వెలువరించింది. మూడు విడతల్లో నవంబర్ 5 నుంచి 15వ తేదీ వరకు పోలింగ్ జరగొచ్చని అంచనా వేస్తున్నారు. అసెంబ్లీ గడువు ముగిసేనాటికే.. కొత్త సభ్యుల ఎంపికను పూర్తిచేయాల్సి ఉంటుంది. 2020లో కూడా మూడు విడతల్లోనే పోలింగ్ నిర్వహించారు. నాడు 71 సీట్లకు అక్టోబర్ 28న, 94 స్థానాలకు నవంబర్ 3న, మరో 78 నియోజకవర్గాల్లో నవంబర్ 7న నిర్వహించారు. ఇక 2015లో మాత్రం ఐదు విడతల్లో పోలింగ్ జరిగింది.

# ట్రంప్ హెచ్1బీ వీసా నిర్ణయం

## అమెరికా కంపెనీలపై1.23 లక్షల కోట్ల భారం




**వాషింగ్టన్ :** అమెరికా టెక్ కంపెనీల యాజమాన్యాలు ఇక నుంచి హెచ్1బీ వీసాలపై ఏటా 14 బిలియన్ డాలర్లు వెచ్చించాల్సి రావొచ్చు. వీటి ఫీజును భారీగా పెంచి లక్ష డాలర్లు చేయడం సంస్థలకు మోయలేని భారంగా మారే ప్రమాదం ఉంది. ఈమేరకు ఫైనాన్షియల్‌టైమ్స్ ఓ కథనం వెలువరించింది. ఫిబ్రవరిలో లాటరీలో రానున్న కొత్త దరఖాస్తులకు మాత్రమే ఇది వర్తించనుంది. అమెరికన్లను నియమించుకొనేలా కంపెనీలపై ఒత్తిడి చేయడమే లక్ష్యంగా ట్రంప్ ఈ నిర్ణయం తీసుకొన్నారు. గతేడాది అన్నీకలిపి 1,41,000 హెచ్1బీ వీసాలు జారీ చేసినట్లు అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ లెక్కలు చెబుతున్నా యి. అదేస్థాయిలో వీసాలు జారీ చేస్తే.. వాటి కోసం చెల్లించాల్సిన ఫీజు మొత్తం 14 బిలియన్ డాలర్ల (రూ. 1.23 లక్షల కోట్లు) గా అంచనాలు ఉన్నాయి. ఈ నిర్ణయం స్టార్టప్ సంస్థలకు శరాఘాతమేనని స్టార్టప్ ఇంక్యుబేటర్ వై కాంబినేటర్ సీఈవో గారీటాన్ వెల్లడించారు. విదేశాల్లోని టెక్ హబ్‌లకు ఇది ఓ బహుమతిగా మారిందని ఆందోళన వ్యక్తంచేశారు. ట్రంప్ నిర్ణయాన్ని కోర్టుల్లో సవాలు చేసే అవకాశం ఉందని ఓ న్యాయవాది వెల్లడించారు. ఈ వీసాలపై లక్ష డాలర్ల నిర్ణయం అధికారాల పరిధిని దాటి ఈ నిర్ణయం తీసుకొన్నారని చెబుతున్నారు. ట్రంప్ ప్రకటనను న్యాయస్థానాలు అడ్డుకొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. వీసాకు అవసరమైన కనీస వేతనం పెంపు వంటి విస్తృత మార్పులపై ట్రంప్ కార్యవర్గం గురిపెట్టి ఈ ప్రకటన చేసిందన్నారు. ఇప్పటికే కొందరు రిపబ్లికన్ చట్టసభ సభ్యులు లాటరీ విధానంలో కాకుండా.. జీతాల ఆధారంగా ఈ వీసాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# పైలట్లే స్విచ్ఛాఫ్ చేశారనడం దురదృష్టకరం

## ఎయిరిండియా ప్రమాద నివేదికపై సుప్రీం వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ :** అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదానికి సంబంధించిన ప్రాథమిక నివేదికపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పైలట్ల పనితీరులో లోపాలు ఉన్నట్లు ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదికను అత్యున్నత న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. ఈ నివేదికపై ఊహాజనిత కథనాలు దురదృష్టకరమని, అది బాధ్యతారాహిత్యమేనని పేర్కొంది. ఈ ప్రమాదంపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్లపై స్పందన తెలియజేయాలంటూ కేంద్రం, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్, ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరోకు నోటీసులు ఇచ్చింది. జూన్ నెలలో అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. విమానం టేకాఫ్ అయ్యాక సెకన్ల వ్యవధిలో ఇంధన కంట్రోల్ స్విచ్‌లు ఆగిపోయినట్లు ఏఏఐబీ నివేదికను సమర్పించింది. ఆ స్విచ్ ఎందుకు ఆఫ్ చేశావని ఒక పైలట్.. మరో పైలట్‌ను ప్రశ్నించాడని రిపోర్ట్‌లో పేర్కొంది. తాను స్విచ్ ఆఫ్ చేయలేదని మరో పైలట్ సమాధానం ఇచ్చినట్లు తెలిపింది. కాక్‌పిట్‌లో ఇవే పైలట్ల ఆఖరి మాటలని ఏఏఐబీ వెల్లడించింది. ఈ రెండు స్విచ్‌లు ఒక సెకను తేడాతో ఒకదాని తర్వాత మరొకటి ఆగినట్లు ఆ నివేదికలో వివరించింది. దర్యాప్తు కొనసాగుతోందని.. ప్రమాదానికి మూల కారణాలు, సిఫార్సులతో తుది నివేదికను విడుదల చేస్తామని తెలిపింది. ఆ తర్వాత అంతర్జాతీయ మీడియాలో వచ్చిన కథనాలు దిగ్భ్రాంతిని కలిగించాయి. ఎయిరిండియా విమానం పైలటే ఇంధన స్విచ్‌ను షట్‌డౌన్ చేశారంటూ ఊహాజనిత వార్తలు ప్రచురించాయి. దర్యాప్తు కొనసాగుతోన్న దశలో ఇటువంటి చర్యలు బాధ్యతారాహిత్యంతో కూడినవని అప్పట్లో ఏఏఐబీ ఖండించింది. ఈనేపథ్యంలో స్వతంత్ర దర్యాప్తు కోసం పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదించారు. అసలు ఏం జరిగిందో గుర్తించేందుకు ఫ్లైట్ డేటా రికార్డర్‌ను పరిశీలించేందుకు నిపుణులను అనుమతించాలని కోరారు. దీనిపై సుప్రీం ధర్మాసనం స్పందించింది. "న్యాయపరమైన, నిష్పాక్షిక దర్యాప్తు వరకు చూసుకుంటే అది ముఖ్యమే. కానీ ఆ వివరాలన్నీ బహిర్గతం చేస్తే.. పాడ్‌కాస్టుల్లో కొత్త సిద్ధాంతాలు అల్లేస్తారు. ఎవరైనా బాధ్యతారహితంగా పైలట్‌ది తప్పు అని చెప్తే.. అది ఆ కుటుంబంపై ఎంతో ప్రభావం చూపుతుంది. ఒకవేళ.. తుది నివేదికలో ఆ పైలట్ పేరు లేకపోతే.. అప్పుడు ఏం చేస్తాం?" అని ప్రశ్నించింది.

# జాక్వెలిన్ ఫెర్నాండెజ్‌కు ఎదురుదెబ్బ

## ఈడీ కేసు కొట్టేయాలన్న పిటిషన్ తిరస్కరణ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 :** మనీ లాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్‌కుఎదురుదెబ్బ తగిలింది. తనపై ఉన్న రూ. 215 కోట్ల ఈడీ కేసును కొట్టివేయాలంటూ సుప్రీం కోర్టులో ఆమె పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం సోమవారం ఆ పిటిషన్‌ను తిరస్కరించింది. ఇదీ నేపథ్యం... ఆర్థిక నేరగాడు సుకేశ్ చంద్రశేఖర్ ప్రధాన నిందితుడిగా ఉన్న రూ. 200 కోట్ల దోపిడీ కేసులో జాక్వెలిన్‌ను ఈడీ నిందితురాలిగా పరిగణించిన సంగతి తెలిసిందే. దోపిడీ చేసిన డబ్బు నుంచి నటి లబ్ధి పొందినట్లు దర్యాప్తులో గుర్తించామని ఈడీ వర్గాలు వెల్లడించాయి. సుకేశ్ చంద్రశేఖర్ దోపిడీదారు అని జాక్వెలిన్‌కు ముందే తెలుసని, అయినప్పటికీ అతడితో సాన్నిహిత్యాన్ని కొనసాగించారని సదరు వర్గాలు పేర్కొన్నాయి. దాదాపు రూ. 200కోట్ల మనీలాండరింగ్ కేసులో ప్రధాన నిందితుడైన సుకేశ్ నుంచి జాక్వెలిన్ ఖరీదైన బహుమతులు అందుకున్నట్లు- వార్తలు వచ్చాయి. అత్యంత ఖరీదైన డిజైనర్ బ్యాగులు, జిమ్ సూట్లు-, వజ్రాల చెవిపోగులు, బ్రాస్‌లెట్, మినీ కూపర్.. ఇలా దాదాపు రూ. 10కోట్ల విలువైన కానుకలను జాక్వెలిన్, ఆమె కుటుంబసభ్యులకు సుకేశ్ ఇచ్చినట్లు- ఈడీ దర్యాప్తులో గుర్తించింది.



# భార్యను పొడిచి చంపిన భర్త

**లక్నో:** పిల్లల ముందే కత్తితో పొడిచి ఆమెను చంపాడు. ఆ తర్వాత పోలీసులకు ఫోన్ చేశాడు. భార్యను హత్య చేసినట్లు చెప్పి అక్కడి నుంచి పారిపోయాడు. చివరకు ఆ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఢిల్లీ శివారు ప్రాంతమైన ఉత్తరప్రదేశ్‌లోని గౌతమ్ బుద్ధ నగర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బులంద్‌షహర్ ప్రాంతానికి చెందిన 36 ఏళ్ల సోనూ శర్మకు ఎనిమిదేళ్ల కిందట 28 ఏళ్ల చంచల్‌తో పెళ్లైంది. దాద్రి ప్రాంతంలోని అద్దె ఇంట్లో వారు నివసిస్తున్నారు. పిల్లలైన ఏడేళ్ల కుమార్తె, ఐదేళ్ల కుమారుడు వారికి ఉన్నారు. కాగా, సోను రెండు నెలలుగా పని కోసం బయటకు వెళ్లాడు. అతడి భార్య చంచల్ ఒక పిజ్జా షాపులో పని చేస్తున్నది. అయితే అక్కడ పని చేసే వ్యక్తితో ఆమెకు వివాహేతర సంబంధం ఉన్నదని సోను అనుమానించాడు. ఈ నేపథ్యంలో పిజ్జా షాపులో పని మానేయమని భార్యతో అన్నాడు. అయితే కుటుంబానికి అండగా ఉండేందుకు ఆ పని మానబోనని ఆమె చెప్పింది. మరోవైపు ఆదివారం ఉదయం ఈ విషయంపై భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో చంచల్ ముఖాన్ని గుడ్డతో కప్పి కత్తితో పొడిచాడు. ఆమె అరుపులు విన్న పిల్లలు నిద్రలేచారు. తండ్రిని అడ్డుకునేందుకు వారు ప్రయత్నించగా తోసేశాడు. సోను అనంతరం పోలీసులకు ఫోన్ చేశాడు. భార్యను హత్య చేసినట్లు చెప్పాడు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయాడు. పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. చంచల్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పారిపోయిన సోనును ఆ తర్వాత అరెస్ట్ చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# బంగారం ధరలు మరింత ప్రియం


## వరుసగా పెరుగుతున్న ధరలతో బెంబేలు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 :** బంగారు ధరలు మాత్రం పైపైకి వెళ్లిపోతున్నాయి. ధరలు తగ్గితే కొందామనుకుంటున్న గోల్డ్ ప్రియులకు రోజురోజుకు ధరలు షాకిస్తున్నాయి. రికార్డ్ స్థాయిలో ధరలు దూసుకుపోతున్నాయి. దీంతో పసిడి ప్రియులకు బంగారం కొనడం కలగానే మారిపోయేలా ఉంది. సోమవారం తులం గోల్డ్ ధరపై రూ. 430 పెరిగింది. ఇక కిలో వెండిపై రూ. 3,000 పెరిగింది. దీంతో బంగారం ప్రియులు వామ్మో.. అంటూ గుండె మీద చేయి వేసుకుంటున్నారు. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ. 430 పెరగడంతో రూ. 1,12,580 దగ్గర అమ్ముడవుతోం ది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ. 400 పెరగడంతో రూ. 1, 03, 200 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ. 330 పెరగడంతో రూ. 84,440 దగ్గర అమ్ముడవుతుంది. ఇక కిలో వెండిపై రూ. 3,000 పెరగడంతో రికార్డ్ స్థాయిలో రూ. 1,38, 000 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక చెన్నైలో రూ. 1,48,000 అమ్ముడవుతుండగా.. ముంబై, ఢిల్లీ, బెంగళూరులో మాత్రం రూ. 1,38, 000 దగ్గర ట్రేడ్ అవుతోంది.

# 'సిందూర్' పార్ట్ 2.. పాక్ తీరుపై ఆధారపడి ఉంటుంది

## కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ :** ఉగ్రవాదులకు మద్దతిస్తోన్న పాకిస్థాన్‌కు సరిహద్దుల్లోనే కాకుండా.. వారి సొంతగడ్డపైనా గట్టిగా బుద్ధి చెప్పామన్నారు కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్. మొరాకో పర్యటనలో ఉన్న ఆయన.. అక్కడి ప్రవాస భారతీయులతో ముచ్చటించారు. ఈసందర్భంగా 'ఆపరేషన్ సిందూర్' విజయాలను పంచుకున్నారు. 'సిందూర్ పార్ట్ 2' అనేది పాక్ తీరుపై ఆధారపడి ఉంటుందని దాయాదిని హెచ్చరించారు. "ఉగ్రవాదులు దేశంలోకి చొరబడి మతం అడిగి మరీ మన పౌరులను చంపేశారు. మేం మతం చూసి వారిని (ఉగ్రవాదులను) మట్టుబెట్టలేదు. వారు చేసిన పనులు చూసి చంపేశాం. పహల్గాం ఘటన జరిగిన తర్వాత త్రివిధ దళాల అధిపతులతో జరిగిన సమావేశంలో వారిని నేను ఒకే ప్రశ్న అడిగాను. ఒకవేళ ప్రభుత్వం ఆమోదం తెలిపితే.. ఆపరేషన్‌కు మీరు సిద్ధమా? అని ప్రశ్నించాను. వారు నిమిషం ఆలస్యం చేయకుండా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. దీంతో మేం ప్రధాని మోదీని కలిస్తే.. ఆయన సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిచ్చారు" అని రాజ్‌నాథ్ సింగ్ వివరించారు. "ఆ తర్వాత ఏం జరిగిందో ప్రపంచమంతా చూసింది. కేవలం సరిహద్దుల్లోనే కాదు.. దాయాది భూభాగంలో 100 కిలోమీటర్లు లోపలికి వెళ్లి మరీ ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేశాం. ఆ దాడుల్లో మసూద్ అజార్ కుటుంబం చెల్లాచెదురైందని జైషే ఉగ్ర నాయకులే అంగీకరించారు. పాకిస్థాన్ అభ్యర్థించడం వల్లే కాల్పుల విరమణకు అంగీకరించాం. స్నేహితులు మారొచ్చు గానీ.. పొరుగువారు ఎప్పటికీ మారరు అని వాజ్‌పేయీ చెబుతుండేవారు. అందుకే వారిని సరైన మార్గంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇక, ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తుతానికి నిలిపివేశాం. అది ఎప్పుడైనా మళ్లీ మొదలవ్వొచ్చు. సిందూర్ పార్ట్ 2, పార్ట్ 3 అనేది పాక్ చర్యలపై ఆధారపడి ఉంటుంది. వారు ఉగ్ర కార్యకలాపాలు కొనసాగిస్తే గనుక మేం తగినవిధంగా బుద్ధి చెబుతాం" అని రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు.

# సభలకు వచ్చే జనమంతా ఓటేయరు : కమల్‌హాసన్



**చెన్నై:** బహిరంగ సభలకు, సమావేశాలకు వచ్చే జనమంతా ఓట్లు వేయరని ఎంఎన్ఎం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కమల్‌హాసన్ అన్నారు. ఇది టీవీకే అధ్యక్షుడు విజయ్‌కు మాత్రమే కాదని, తనకూ వర్తిస్తుందన్నారు. ఈ మేరకు చెన్నైలో విలేకర్లతో మాట్లాడారు. వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈనేపథ్యంలో విజయ్ నిర్వహిస్తోన్న ప్రచార సభలకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరవుతున్నారు. దీనిపై రాష్ట్ర నేతలు భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తంచేస్తున్నారు. దీనిపై తాజాగా కమల్ హాసన్‌కు ప్రశ్న ఎదురైంది. "సభలకు వచ్చే జనమంతా ఓటేయ్యరు. కచ్చితంగా అంతా ఓటింగ్‌గా మారదు. ఇది నాయకులందరికీ వర్తిస్తుంది. ఇందుకు విజయ్ మినహాయింపేమీ కాదు. నాతో సహా భారత్‌లో ఉన్న నేతలందరికీ ఈ మాట సరిపోతుంది" అని అన్నారు. కొత్తగా రాజకీయాల్లోకి ప్రవేశించిన విజయ్‌కు ఏం సలహా ఇస్తారని అడగ్గా.. సన్మార్గంలో ధైర్యంగా ముందుకుసాగుతూ ప్రజలకు సేవ చేయాలని సూచించారు. అందరికీ ఇదే విజ్ఞప్తి చేస్తున్నానని చెప్పారు. రాజకీయ నేతలే కాదు.. సినిమా రంగంలో ఉన్నవారు విమర్శలను ఎదుర్కొంటారని అన్నారు. అప్పుడే అడుగుపెట్టిన వారిని విమర్శలు వదలవని వ్యాఖ్యానించారు. కాగా.. రెండురోజుల క్రితం తిరువారూర్‌లో జరిగిన ఓ సభలో విజయ్ మాట్లాడుతూ ఒక అనుమానం వ్యక్తం చేశారు. "సభకు వచ్చే జనాలంతా ఓట్లేయరని అంతా అంటున్నారు. అది నిజమా..?" అని అడిగారు. దానికి అక్కడున్న జనమంతా 'విజయ్' అని నినదించారు. పరోక్షంగా తాము విజయ్‌కు ఓటేస్తామని వారు చెప్పారు. అందుకు టీవీకే చీఫ్ కృతజ్ఞతలు తెలియజేశారు.



# నా రీల్స్ చూడటం ఆపండి

## కేజ్రీవాల్‌కు ఢిల్లీ సీఎం చురకలు

ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌పై ఢిల్లీ సీఎం రేఖాగుప్తా వ్యంగ్యాస్త్రాలు విసిరారు. తన రీల్స్ చూడటం ఆపేయాలని చురకలు అంటించారు. ఇంతకీ విషయం ఏంటంటే..? రేఖా గుప్తా మాట్లాడుతున్నట్టుగా ఉన్న ఒక వీడియోను ఆదివారం అరవింద్ కేజ్రీవాల్ షేర్ చేశారు. ఈవీఎంలలో అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్ చేసిన ఆరోపణలపై ఆమె మాట్లాడుతున్నట్టుగా అందులో ఉంది. "70 ఏళ్లపాటు కాంగ్రెస్ ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడినంతకాలం అంతా బాగానే ఉంది. ఇప్పుడు మేం చేస్తే మాత్రం వారు బాధపడుతున్నారు. వారు విజయం సాధిస్తే.. ప్రజాతీర్పు అంటారు. మేం గెలుపొందితే, ఈవీఎంలు హ్యాక్ అయ్యాయని ఆరోపిస్తారు. రాహుల్ గాంధీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తూనే ఉంటారు" అని సీఎం చెప్తున్నట్టుగా ఆ వీడియో ఉంది. 'సీఎం ఏం మాట్లాడుతున్నారు..?' అని ఆ క్లిప్‌ను ఎక్స్ వేదికగా కేజ్రీవాల్ పోస్టు చేశారు. అదొక ఎడిటెడ్ వీడియో అని భాజపా తోసిపుచ్చింది. తాజాగా ఇదే అంశంపై రేఖా గుప్తా స్పందించారు. కార్యకర్తలతో మాట్లాడుతూ.. "కేజ్రీవాల్ సర్.. నాకు సంబంధించిన రీల్స్, ఇంటర్వ్యూలు చూడటం తగ్గించుకోవాలి. మేడమ్ ఏం చెప్పారు..ఏం చెప్పలేదో తెలుసుకునేందుకు రోజంతా మీరు నా రీల్స్ చూస్తున్నారని అనుకుంటున్నాను. ఆయన నిజంగా దృష్టి పెట్టాలనుకుంటే.. వరదలతో ఇబ్బందిపడిన పంజాబ్ ప్రజల గురించి ఆలోచించండి. ఆయన బాధితుల దగ్గరకు వెళ్లినట్లు నాకైతే కనిపించలేదు" అని సెటైర్ వేశారు. పంజాబ్‌లో ఆమ్‌ఆద్మీపార్టీ అధికారంలో ఉంది.



# మీ ప్రేమాభిమానాలే ఇంతవాడిని చేశాయి

## 47 ఏళ్ల చిత్ర ప్రయాణంపై చిరంజీవి ఎమోషన్



తన తొలి చిత్రం ప్రాణం ఖరీదు విడుదలై నేటికి 47 ఏళ్లు అయిన సందర్భంగా అగ్ర కథానాయకుడు చిరంజీవి పోస్ట్ పెట్టారు. ఆ చిత్రాన్ని గుర్తుచేసుకుంటూ అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. నటుడిగా తనకు ఈ చిత్రం ప్రాణం పోసిందన్నారు. 22 సెప్టెంబర్ 1978.. కొణిదెల శివశంకర వరప్రసాద్ అనే నేను ప్రాణం ఖరీదు చిత్రంతో మీకు పరిచయమయ్యాను. ఈ సినిమా విడుదలై నేటికి 47 ఏళ్లు దిగ్విజయంగా పూర్తయ్యాయి. ఈ సినిమా ద్వారా నాకు నటుడిగా ప్రాణం పోసి.. మీ అన్నయ్యగా, కొడుకుగా, మీ కుటుంబ సభ్యుడిగా, ఒక మెగాస్టార్‌గా.. అనుక్షణం నన్ను ఆదరించి, అభిమానించిన తెలుగు సినిమా ప్రేక్షకులకు ఎప్పుడూ కృతజ్ఞుడినై ఉంటాను. నేటికి 155 సినిమాలను నేను పూర్తి చేసుకున్నాను అంటే.. అందుకు కారణం నిస్వార్థమైన మీ ప్రేమే. ఈ 47 ఏళ్లలో నేను పొందిన ఎన్నో అవార్డులు, గౌరవ మర్యాదలు నావి కావు, మీ అందరివీ, మీరందించినవి. మనందరి మధ్య ఈ ప్రేమానుబంధం ఎప్పటికీ ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నా అని చిరంజీవి తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. చిరంజీవి కథానాయకుడిగా నటించిన తొలి చిత్రం పునాది రాళ్లు. అయితే, ఆ తర్వాత నటించిన ప్రాణం ఖరీదు ముందుగా విడుదల కావటం గమనార్హం. కె.వాసు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో చిరు నరసింహ అనే పాత్రను పోషించారు. రావుగోపాలరావు, జయసుధ, చంద్రమోహన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇక ఈ సినిమా విడుదలై 47 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చిరుకు సోషల్ మీడియాలో సినీ ప్రముఖులు, అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ప్రస్తుతం చిరంజీవి నాలుగు సినిమాలతో బిజీగా ఉన్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో మన శంకర వరప్రసాద్ గారులో నటిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఇది ప్రేక్షకుల ముందుకురానుంది . అలాగే వశిష్ట దర్శకత్వంలో విశ్వంభరతో సందడి చేయనున్నారు.

## మళ్లీ ఫామ్‌లోకి కృతి శెట్టి..

2024లో 'మనమే' మూవీ తర్వాత మరో సినిమా అనౌన్స్ చేయలేదు కృతి శెట్టి. 'ఉప్పెన' సినిమాతో చిత్ర పరిశ్రమకు ఎంట్రీ ఇచ్చిన ఈమె.. కెరీర్ స్టార్టింగ్‌లోనే ఫుల్ క్రేజ్ తెచ్చుకుని బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసింది. కానీ వరుస పరాజయాలు చవిచూడటంతో ప్రస్తుతం తెలుగు ఇండస్ట్రీకి దూరం అయింది. అయితే కృతి శెట్టి ప్రజెంట్ ఓ తమిళ చిత్రం చేస్తున్నట్లు అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చింది. జయం రవి హీరోగా రాబోతున్న లేటెస్ట్ మూవీ 'జెనీ'. గణేష్ కె బాబు దర్శకత్వం వహిస్తున్న ఈ తమిళ చిత్రంలో కళ్యాణి ప్రియదర్శన్, వామికా గబ్బి హీరోయిన్లుగా నటిస్తుండగా.. తాజాగా ఇందులో కృతి శెట్టి కూడా భాగం అయింది. ఈరోజు ఈ హీరోయిన్ బర్త్‌డే కావడంతో 'జెనీ' సినిమా టీమ్ నుంచి స్పెషల్ విషెస్ తెలియజేస్తూ పోస్టర్ రిలీజ్ చేశారు టీమ్. దీంతో ఈ సినిమాలో కృతి నటిస్తుందని తెలుసుకుని ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా.. ఈ ఏడాదిలోనే విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్.

# పవన్ ఓజి ట్రైలర్ విడుదల

## కత్తితో కనిపించిన పవన్



పవన్ కల్యాణ్ అభిమానులతోపాటు తెలుగు సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూసిన ఓజీ ట్రైలర్ వచ్చేసింది. ఆదివారం ఉదయమే రిలీజ్ చేస్తామని ఊరించిన చిత్ర బృందం.. తాజాగా విడుదల చేసింది. పవన్ కల్యాణ్ స్టైలిష్ లుక్స్, తమన్ నేపథ్య సంగీతం ట్రైలర్‌లో హైలైట్‌గా ఉన్నాయి. సుజీత్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో పవన్ గ్యాంగ్‌స్టర్ ఓజాస్ గంభీరగా నటించిన సంగతి తెలిసిందే. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హాష్మీ విలన్ పాత్ర పోషించారు. ప్రియాంక మోహన్ హీరోయిన్. ఈ సినిమా ఈ నెల 25న బాక్సాఫీసు ముందుకు రానుంది. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ నటించిన ఓజి ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. వర్షం కురిసినా అభిమానుల తాకిడి ఏమాత్రం తగ్గలేదు. వేలాది మందితో స్టేడియాం కిక్కిరిసిపోయింది. పవన్ కల్యాణ్ స్టేజీపైకి కత్తిని చేతిలో పట్టుకుని మెగా స్టైల్లో వేదికపైకి ఎంట్రీ ఇవ్వడం అభిమానులకి మాంచి కిక్ ఇచ్చింది. పవనన్నా ఎలివేషన్ ఓ రేంజ్‌లో ఉందని కామెంట్ చేస్తున్నారు.. ఈ ఎంట్రీకి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్, జనసైనికులు మాత్రం చాలా రోజుల తర్వాత పవన్ కళ్యాణ్‌ని మళ్లీ సినిమాటిక్ లుక్‌లో చూశామని, అదిరిపోయిందంతే అని కామెంట్ చేస్తున్నారు. ఇక ఈ వేడుకలో పవన్ కళ్యాణ్ చేసిన కామెంట్స్ నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. సుజీత్ నాకు పెద్ద అభిమాని. కథను ముక్కలు ముక్కలుగా చెప్పినా, డైరెక్షన్‌లో మాత్రం అదరగొట్టాడు. థమన్ ఈ సినిమాకు ఇంకో హీరో లాంటివాడు. ఈ సినిమాలో నేను బాగా ఇన్వాల్వ్ అయ్యాను... డిప్యూటీ సీఎం అన్న విషయమే మర్చిపోయాను, అని మాట్లాడి అభిమానులను ఆకట్టుకున్నారు పవన్ కళ్యాణ్.

## ప్రశాంత్ వర్మ అధీర నుంచి పోస్టర్



తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి ప్రతి ఏడాది ఓ సినిమా వస్తుందని దర్శకుడు ప్రశాంత్ వర్మ చెప్పిన సంగతి తెలిసిందే. తాజాగా పీవీసీయూలో రానున్న అధీరపై ఆయన అప్‌డేట్ ఇచ్చారు. ఇందులో ఎస్‌జే సూర్య, కల్యాణ్ దాసరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచాన్ని చీకటి కమ్మేసినప్పుడు.. వెలుగు రూపంలో ఆశాకిరణం పుట్టుకొస్తుంది అంటూ అధీర నుంచి ఆసక్తికర పోస్టర్‌ను పంచుకున్నారు. ప్రశాంత్‌వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా ఈ సూపర్ హీరో ఫిల్మ్ రానున్నట్లు తెలిపారు. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కనున్నట్లు వెల్లడించారు. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. తన సినిమాటిక్ యూనివర్స్‌కు సంబంధించి ప్రస్తుతం 20 స్క్రిప్ట్‌లు సిద్ధమవుతున్నాయని.. తొలి ఫేజ్‌లో ఆరుగురు సూపర్ హీరోల సినిమాలు తీస్తామని గతంలో ప్రశాంత్ వర్మ వివరించారు. ఇందులోభాగంగా ఇప్పటికే మహాకాళీని ప్రకటించారు. మా యూనివర్స్‌కు కొత్త శక్తి జోడైంది. అత్యంత భయంకరమైన చెడుపై యుద్ధం చేయడానికి కాళికాదేవి స్వరూపం రానుంది. సూపర్ హీరోలు ఎలా ఉంటారో ఈ చిత్రంలో చూపించనున్నాం అని మహాకాళీని పరిచయం చేశారు. ఇప్పుడు ఈ అధీర గ్లింప్స్‌ను ఓజీ సినిమాలో చూపించాలని ప్లాన్‌లో ఉన్నట్లు సమాచారం.




## కాంతారా చాప్టర్ 1 ట్రైలర్ విడుదల

2022లో రికార్డు సృష్టించిన కాంతర.. మరోసారి దాన్ని రిపీట్ చేసేందుకు సిద్ధమైంది. దీనికి ప్రీక్వెల్‌గా కాంతార చాప్టర్ 1 తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. రిషబ్‌శెట్టి స్వీయ దర్శకత్వంలో ముస్తాబవుతోన్న ఈ పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను ప్రభాస్ విడుదల చేశారు. రిషబ్ తన నటనతో ఆకట్టుకుంటున్నారు. రుక్మిణి వసంత్ మహారాణి పాత్రలో కనిపించారు. బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, విజువల్స్ గూస్‌బంప్స్ తెప్పించేలా ఉన్నాయి. శాండల్‌వుడ్ మల్టీ టాలెంటెడ్ సెలబ్రిటీల్లో టాప్‌లో ఉంటాడు రిషబ్ శెట్టి. కాంతార సినిమాతో ఇండియన్ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన రిషబ్ శెట్టి ప్రస్తుతం స్వీయ దర్శకత్వంలో కాంతార చాప్టర్ 1లో నటిస్తున్నాడు. ఈ మూవీ అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది రిషబ్ శెట్టి టీం.

## దుల్కర్ నా బెస్ట్ ఫ్రెండ్

### కొత్తలోక హీరోయిన్ కళ్యాణి



మలయాళీ బ్యూటీ అయినప్పటికి కళ్యాణి ప్రియదర్శన్ తెలుగు ప్రేక్షకులకు కూడా బాగా పరిచయం. హలో, చిత్రలహరి, రణరంగం సినిమాలతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపు సంపాదించుకున్న ఈ భామ, తాజాగా విడుదలైన కొత్త లోకలో సూపర్ ఉమెన్ పాత్రతో అలరించింది. ఇంతవరకు ప్రధానంగా సరదా పాత్రలు చేసిన ఆమె, ఈ సినిమాలో తొలిసారి యాక్షన్ సీన్లలో కనిపించడం ప్రత్యేకం. అయితే ఇటీవల ఇంటర్వ్యూలో కల్యాణి తన కెరీర్‌తో పాటు వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆసక్తికర విషయాలు పంచుకుంది. మా స్వస్థలం కేరళ అయినప్పటికీ నేను చెన్నై లో పుట్టి పెరిగాను. అమ్మానాన్న ఇండస్ట్రీలో ఉండటంతో చిన్నప్పటి నుంచే షూటింగ్ సెట్స్ వాతావరణం నాకు పరిచయం. అక్కడి నుంచే సినిమాలపై ఆసక్తి పెరిగింది. 2017లో హలో ద్వారా టాలీవుడ్‌లో హీరోయిన్‌గా అడుగు పెట్టాను. అప్పటి వరకు ఎక్కువగా లైట్ హార్టెడ్ రోల్స్ మాత్రమే చేసాను. కానీ కొత్త లోక కోసం నేను ఆరు నెలలు స్పెషల్ ట్రైనింగ్ తీసుకుని యాక్షన్ సీక్వెన్స్ చేశాను. ఇది నాకు కొత్త అనుభవం అని చెప్పింది. అలాగే తన స్నేహితుడు దుల్కర్ సల్మాన్ గురించి మాట్లాడుతూ.. సినీ ఇండస్ట్రీలో నాకు దుల్కర్ బెస్ట్ ఫ్రెండ్. నాకు ఏ కష్టం వచ్చినా, ఏ సమస్య ఎదురైనా, లేదా ఏదైనా సలహా కావాలన్నా మొదటి ఫోన్ దుల్కర్‌కే చేస్తాను. ఆయన నాకు చాలా సపోర్ట్‌గా ఉంటారని చెప్పి తన బంధాన్ని బయటపెట్టింది. కల్యాణి ప్రస్తుతం మలయాళం, తెలుగు సినిమాల్లో వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంటూ, విభిన్న పాత్రల ద్వారా తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకోవాలని ప్రయత్నిస్తోంది.

## అక్టోబర్‌లో వెంకీ, త్రివిక్రమ్ షూటింగ్




వెంకటేశ్, త్రివిక్రమ్ శ్రీనివాస్.. టాలీవుడ్‌లో ఈ కాంబినేషన్‌కు ఉన్న క్రేజే వేరు. త్రివిక్రమ్ శ్రీనివాస్ డైలాగ్స్ అందించిన నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి సినిమాలు ఆల్‌టైమ్ ఎవర్‌గ్రీన్ సూపర్ హిట్ సినిమాల జాబితాలో ఉంటాయి. ఇక ఈ ఇద్దరూ కలిసి కొత్త సినిమాకు ఫుల్ టైం పనిచేయబోతున్నారని తెలిసిందే. వెంకీ 77 వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ చిత్రం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గ్రాండ్‌గా లాంచ్ అయింది. కాగా ఈ సినిమా షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందా..? అని ఎదురుచూస్తున్న మూవీ లవర్స్ కోసం అదిరిపోయే న్యూస్ ఒకటి తెరపైకి వచ్చింది. తాజా కథనాల ప్రకారం వెంకీ 77 అక్టోబర్ మొదటి వారంలో సెట్స్‌పైకి వెళ్లనుంది. హైదరాబాద్‌లో ఫస్ట్ షెడ్యూల్ కొనసాగనుందట. అంతేకాదు కేజీఎఫ్ ఫేం శ్రీనిధి శెట్టిని హీరోయిన్‌గా ఫైనల్ చేయనున్నట్టు ఫిలింనగర్ సర్కిల్‌లో వార్తలు వస్తున్నా..ఎంతవరకు నిజం అనేది తెలియాల్సి ఉంది. ఈ మూవీని హారికా అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై సీనియర్ నిర్మాత ఎస్ రాధాకృష్ణ తెరకెక్కించనున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రానికి హర్షవర్ధన్ రామేశ్వర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించనున్నాడని తెలుస్తుండగా.. మేకర్స్ నుంచి స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్‌ను ఖాతాలో వేసుకున్నాడు వెంకీ.

జనం వార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..

# విదేశీ డిజిటల్ కంపెనీలపై మళ్లీ ఈక్వలైజేషన్ లెవీ విధించండి

భారత మార్కెట్ నుంచి విస్తృత ఆదాయం పొందుతున్న విదేశీ డిజిటల్ కంపెనీలపై మళ్లీ ఈక్వలైజేషన్ లెవీని విధించాలని ఇండియన్ డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీ సందర్భంగా వినతి సమర్పించారు. వాస్తవానికి కేంద్రం ఈ లెవీని తొలగించడం వల్ల డిజిటల్ రంగంలో అసమాన పరిస్థితులు తలెత్తాయని పేర్కొన్నారు. విదేశీ టెక్నాలజీ ప్లాట్‌ఫామ్‌లకు పరిస్థితులు అనుకూలంగా మారినట్లు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికే ఆ సంస్థలు వార్తలను వివిధ రకాల వేదికలపై ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా షేర్ చేస్తున్నాయని చెప్పారు. ఓఈసీడీ/జీ20 కింద ది గ్లోబల్ పిల్లర్ వన్ ఫ్రేమ్‌వర్క్ అమల్లోకి వచ్చేలోపు.. ఫ్రాన్స్, యూకే, ఇటలీ, స్పెయిన్ వంటివి ఇప్పటికే డిజిటల్ సర్వీసెస్ ట్యాక్సుల వంటి వాటిని తాత్కాలిక చర్యలుగా చేపట్టినట్లు పబ్లిషర్లు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అతిపెద్ద డిజిటల్ మార్కెట్ అయిన భారత్‌లో అటువంటి వ్యవస్థ లేకపోవడం ఇక్కడి పబ్లిషర్లు ప్రతికూల పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు.









## నష్టాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్

**ముంబాయి :** దేశీయ స్టాక్ మార్కెట్ సోమవారం నష్టాల్లో ముగిసింది. కొత్త హెచ్1బీ వీసా దరఖాస్తుల రుసుము పెంచాలన్న అమెరికా నిర్ణయంతో ఐటీ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. సెన్సెక్స్ 460 పాయింట్లు తగ్గగా.. నిఫ్టీ 64 పాయింట్ల మేర క్షీణించింది. ఉదయం 82,151.07 వద్ద ప్రారంభమయిన సూచీ రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఒక దశలో 81,997.29 పాయింట్ల కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్ చివరకు 466.26 పాయింట్లు క్షీణించి చివరకు 82,159.97 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 64.90 పాయింట్లు తగ్గి 25,262.15కి దిగొచ్చింది. ఇక రూపాయి మారకం విలువ డాలరుతో పోలిస్తే 15 పైసలు తగ్గి 88.31 వద్ద ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఎటెర్నల్, బజాజ్ ఆటో, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఇన్ఫోసిస్, టెక్‌మహీంద్రా, టీసీఎస్, సిప్లా, విప్రో వంటి కపెనీల షేర్లు నష్టో ముగిశాయి.




## 'మా వాళ్లు భయపడే రకం కాదు..'

### గౌతమ్ గంభీర్ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలు వైరల్

చూడటానికి నిశ్శబ్దంగా, ఏం మాట్లాడకుండా ఉండే ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఎప్పుడైనా స్పందించాడంటే అది వైరల్‌గా మారిపోవడం ఖాయం. ఇప్పుడు ఆసియా కప్‌లో పాకిస్థాన్‌ను భారత్ రెండోసారి చిత్తు చేసిన తర్వాత గంభీర్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ పెట్టాడు. పాకిస్థాన్ ఓపెనర్ ఫర్హాన్ 'గన్' షాట్‌కు, బౌలర్ హారిస్ రౌఫ్ 'వెకిలి' చేష్టలకు భయపడేదే లేదు అనే అర్థం వచ్చేలా స్టోరీ షేర్ చేశాడు. టీమ్‌ఇండియా ఓపెనర్లు అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్‌తోపాటు టీమ్‌ఇండియా ఇమేజ్‌లను పోస్టుకు జత చేశాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత 'అంపైర్ల'కు మాత్రమే కరచాలనం చేయాలని.. పాక్ ప్లేయర్లకు అవసరం లేదని మేనేజ్‌మెంట్ నుంచి స్పష్టమైన సందేశం వెళ్లేలా చూశాడు. భారత్ విజయంపై బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లాతోపాటు మాజీ క్రికెటర్లు సోషల్ మీడియాలో అభినందనలు తెలిపారు.

## 70ల్లోకి వచ్చాక.. సెంచరీ మిస్ చేయొద్దు

### అభిషేక్‌కు సెహ్వాగ్ సూచన



పాకిస్థాన్ పేస్, స్పిన్‌ను కకావికలం చేసిన భారత ఓపెనర్ అభిషేక్ శర్మపై మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ ప్రశంసలు కురిపించాడు. మ్యాచ్ అనంతరం వీరూతో కలిసి అభిషేక్ చిట్‌చాట్‌లో పాల్గొన్నాడు. ఈసందర్భంగా తనకు ఎదురైన ప్రశ్నకు అభిషేక్ ఇచ్చిన సమాధానం అదిరిపోయింది. అలాగే యువ బ్యాటర్‌కు సెహ్వాగ్ కీలక సూచన చేశాడు. పాక్‌పై అభిషేక్ 39 బంతుల్లో 74 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. వీరేంద్ర సెహ్వాగ్‌తో తనను పోల్చడంపై అభిషేక్ స్పందించాడు. తొలి బంతినే బౌండరీగా మలిచేందుకు ఇద్దరూ చూస్తుంటారు. అయితే, ఇప్పటి పాక్ బౌలింగ్‌లో పెద్దగా పస లేదని.. అప్పటి బౌలర్లను ఎదుర్కోవడం చాలా కష్టమని అభిషేక్ వ్యాఖ్యానించాడు. అలాంటి బౌలింగ్‌లోనే సెహ్వాగ్ భారీ షాట్లు కొట్టేవాడని గుర్తుచేశాడు. అభిషేక్ ఇచ్చిన ప్రశంసకు ఆనందం వ్యక్తంచేసిన సెహ్వాగ్ కీలక సూచన చేశాడు. గతంలో తనకు క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ చెప్పిన మాటలు గుర్తు చేసుకున్నాడు. "నువ్వు ఎప్పుడైతే 70లు లేదా 80ల్లోకి వచ్చావో.. సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకోవద్దు. నాకు ఇవే మాటలు సునీల్ గావస్కర్ చెప్పారు. రిటైర్ అయిన తర్వాత ఇలా ఔటైన ఇన్నింగ్స్ గుర్తుకొస్తుంటాయి. అరె, సెంచరీ చేసి ఉంటే బాగుండేదన్న భావన కలుగుతుంది. అందుకే, ఇలాంటి ఇన్నింగ్స్‌ను శతకాలుగా మార్చుకోవాలి. అవకాశాలు మళ్లీ మళ్లీ రావు. నీదైన రోజున నాటౌట్‌గా ఉండేందుకు ప్రయత్నించు" అని సెహ్వాగ్ పేర్కొన్నాడు.

## వన్డేల్లో తన రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకున్న క్వింటన్ డికాక్



దక్షిణాఫ్రికా ఆటగాడు క్వింటన్ డికాక్ వన్డేల్లో తన రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకున్నాడు. అతడు 2023 వన్డే వరల్డ్ కప్ తర్వాత వన్డే ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. ఆ టోర్నీలో అతడు 594 పరుగులు చేశాడు. అలాగే క్వింటన్.. టీ20 వరల్డ్ కప్ 2024 సౌతాఫ్రికా స్క్వాడ్‌లోనూ భాగమయ్యాడు. టీ20 ఫార్మాట్‌కు అతడు రిటైర్మెంట్ అయితే ప్రకటించలేదు కానీ.. టీ20 వరల్డ్ కప్ తర్వాత నుంచి ఫ్రాంఛైజీ క్రికెట్ ఆడటం మీద దృష్టి పెట్టాడు. అతడు అంతర్జాతీయంగా.. చివరిసారి టీ20 వరల్డ్ కప్ 2024లో టీమ్‌ఇండియాతో సౌతాఫ్రికా తలపడిన ఫైనల్ మ్యాచ్‌లో కనిపించాడు. క్వింటన్ డికాక్ పునరాగమనం గురించి దక్షిణాఫ్రికా కోచ్ షుక్రీ కాన్రాడ్ మాట్లాడాడు. అతడి రాక జట్టుకు ఎంతో ప్రోత్సాహాన్నిస్తుందన్నాడు. 'క్వింటన్ జట్టులోకి తిరిగి రావడం మాకు సానుకూలాంశం. మేం గత నెలలో అతడితో మాట్లాడాం. అతడు ఇప్పటికీ దేశం తరఫున ఆడేందుకు ఉత్సాహంగా ఉన్నాడు. అతడి శక్తి, సామర్థ్యాల గురించి అందరికీ తెలుసు. అతడు తిరిగి రావడం జట్టుకు ఎంతో ప్రయోజనకరం' అని దక్షిణాఫ్రికా కోచ్.. షుక్రీ కాన్రాడ్ అన్నాడు. దక్షిణాఫ్రికా.. అక్టోబర్ 12 నుంచి పాకిస్థాన్‌లో పర్యటించనుంది.

## గణాంకాలు చూసైనా.. పాక్‌ను ప్రత్యర్థి అనొద్దు

### ఫ్యాన్స్‌ను ఎంటర్‌టైన్ చేయడానికే వచ్చాం : సూర్యకుమార్




ఆసియా కప్ సూపర్ -4లో పాకిస్థాన్‌ను టీమ్‌ఇండియా మట్టికరిపించింది. గత ఆరు మ్యాచుల్లో ఒక్కసారి కూడా పాక్ గెలవలేదు. ఈ గణాంకాలను ప్రస్తావిస్తూ పరోక్షంగా పాక్‌పై భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఇంకెప్పుడూ పాక్‌ను తమకు ప్రత్యర్థి అని అనొద్దని కోరాడు. "ఇకనుంచి ప్రత్యర్థి అనే పదం వాడొద్దు. ఏ జట్టైనా నాణ్యమైన క్రికెట్ ఆడుతుందా? లేదా? అనేది ముఖ్యం. నా అభిప్రాయం ప్రకారం.. ఏవైనా రెండు జట్లు ఓ 20 మ్యాచుల్లో తలపడ్డాయనుకుందాం. 11-9 లేదా, 10-10తో ఉంటే బాగా ఆడాయని అనుకోవచ్చు. అప్పుడు సరైన ప్రత్యర్థులు అని పిలవచ్చు. కానీ, 13-0, 10-1.. ఇలాంటి గణాంకాలు నమోదైతే అక్కడ పోటీ ఏముంది.. ప్రత్యర్థి అని పిలిచేంత ఏమీలేదు. ఇక మైదానం పూర్తిగా నిండటం గురించి అనుకుంటే.. మా జట్టులోని ప్రతిఒక్కరం ఫ్యాన్స్‌ను ఎంటర్‌టైన్ చేయడానికే వచ్చామని ఇంతకుముందే చెప్పా. పాక్‌పై అత్యుత్తమ క్రికెట్ ఆడాం కాబట్టి విజయం సాధించాం. గత వారం ఆడిన పిచ్ కంటే ఈసారి బాగుంది. బ్యాటింగ్ చేయడానికి అనుకూలంగా ఉంది. ఎవరైతే 7-15 ఓవర్ల మధ్య మెరుగైన ఆటతీరు ప్రదర్శిస్తారో వారే గెలుస్తారు. మేం ఆ విషయంలో పైచేయి సాధించాం. మా బౌలింగ్ యూనిట్‌పై ఆందోళన ఏమీ లేదు. ఒక్క మ్యాచ్‌లో సరిగ్గా వేయనంత మాత్రాన ఏమీ కాదు (బుమ్రా బౌలింగ్‌పై). అతడేమీ రోబో కాదు. ఈ మ్యాచ్‌లో కలిసిరాలేదు. అభిషేక్, గిల్, దూబె అదరగొట్టారు. మా ఫీల్డింగ్ కోచ్ నుంచి అందరికీ మెయిల్స్ వస్తాయి" అని సూర్య వెల్లడించాడు.

## ఆడలేక కవ్వింపులు..

### నోటికి పనిజెప్పిన పాక్ పేసర్లకు భలే గుణపాఠం




భారత్ - పాకిస్థాన్ జట్ల మధ్య మ్యాచ్ అంటే ఎలా ఉంటుందో దుబాయ్ వేదికగా జరిగిన ఆసియా కప్‌లోని సూపర్-4 మ్యాచ్‌ను చూస్తే అర్థమైపోతుంది. 'కరచాలనం' వివాదంతో ఖంగుతిన్న పాక్ క్రికెటర్లు.. వరుసగా భారత్ చేతిలో ఓడిపోవడంతో వారి అసహనం కట్టలు తెంచుకుంది. సీనియర్ బౌలర్లు షహీన్, హారిస్ రౌఫ్ కాస్త హద్దులు దాటారు. 'ఇలాంటప్పుడు కోహ్లీ' ఉండుంటేనా? అని భారత సగటు అభిమాని కచ్చితంగా మనసులో అనుకొనే ఉంటాడు. అతడు లేకపోతేనేం మేమున్నామంటూ ఓపెనర్లు అభిషేక్, గిల్ ఘాటుగా రిప్లై ఇచ్చారు. కేవలం మాటలతోనే కాకుండా బ్యాట్‌తోనూ సమాధానం ఇచ్చారు. పవర్ ప్లేలో షహీన్‌ను ఆటాడుకున్న అభిషేక్.. హారిస్ వచ్చాక కాస్త ఆచితూచి ఆడాడు. ఇదే అదునుగా యువ బ్యాటర్ వైపు గుర్రుగా చూస్తూ స్లెడ్జింగ్ మొదలుపెట్టాడు. మరోవైపు 'కోహ్లీ' వారసుడిగా భావిస్తోన్న గిల్ మాత్రం కామ్‌గా బదులిచ్చాడు. బౌండరీ లైన్ వద్ద కూడా రౌఫ్ వెకిలి సైగలతో రెచ్చిపోయాడు. భారత ఫైటర్ జెట్‌లను కూల్చేశామని ప్రగల్భాలు పలికిన పాక్ సైన్యం వ్యాఖ్యలను గుర్తు చేస్తూ హావభావాలు చూపించాడు.

### ఆ సైగలకు అర్థమేంటో..

పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా టీమ్‌ఇండియా క్రికెటర్లు పాక్ ప్లేయర్లతో కరచాలనం చేయలేదు. గ్రూప్ మ్యాచ్ అనంతరం విజయాన్ని బాధితులకు అంకితం చేస్తున్నట్లు కెప్టెన్ సూర్య తెలిపాడు. సూపర్-4లో పాకిస్థాన్ ఏ ఛాన్స్‌ను వదలకూడదని భావించినట్లుంది. భారత్‌ను ఇరకాటంలో పెట్టేందుకు ప్రయత్నించింది. తొలి బంతి వేసిన తర్వాత పాక్ ఓపెనర్ సాహిబ్‌జాద ఫర్హాన్ ప్రవర్తించిన తీరే తార్కాణం. మైండ్ గేమ్ మొదలుపెట్టాడు. ఏ కారణం లేకుండానే చేతికి వేసుకున్న బ్యాండ్‌ను మార్చుకొన్నాడు. ఒత్తిడిని అధిగమించేందుకు ఇదొక ట్రిక్ ప్లే చేశాడు. అభిషేక్ క్యాచ్ వదిలేసిన తర్వాత కాస్త పైచేయి సాధించేలా కనిపించింది. ఇక అర్ధశతకం చేసిన తర్వాత 'గన్' ఫైర్ చేస్తున్నట్లుగా ఫర్హాన్ సైగలు చేసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తన సంబరాలను ఈవిధంగా చేసుకోవడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. పాక్ బ్యాటింగ్ సమయంలో వారి 'మైండ్‌గేమ్' వర్కౌట్ కాలేదు. దీంతో పాక్ బౌలర్లు ఆ బాధ్యతను తీసుకొనేందుకు ప్రయత్నించారు. తీరా, టీమ్‌ఇండియా ఓపెనర్ల నుంచి ప్రతిఘటన ఎదురుకావడంతో తోక ముడిచారు.

## మా కెప్టెనే.. జట్టులో బలహీన ప్లేయర్

### షోయబ్ అక్తర్ ఫైర్



భారత్ చేతిలో తమ జట్టు ఓడిపోవడానికి ప్రధాన కారణం కెప్టెన్ సల్మాన్ అఘానేనని మాజీ పేసర్ షోయబ్ అక్తర్ విమర్శించాడు. ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నాడో.. అతడికైనా అర్థమవుతుందా? అని ప్రశ్నించాడు. భారీ స్కోరు చేయాల్సిన సమయంలో ముందు బ్యాటింగ్‌కు రాకపోవడంపై అక్తర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. జట్టులో అతడే అత్యంత బలహీనమైన ప్లేయర్ అని వ్యాఖ్యానించాడు. "కెప్టెన్‌గా ఇప్పటి వరకు సల్మాన్ అఘా ఏం చేశాడో తెలియడం లేదు. జట్టుకు సారథ్యం వహించేటప్పుడు చాలా అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. కానీ, మా జట్టు అత్యంత బలహీనంగా కనిపించ డానికి కారణం కెప్టెనే. కానీ, దీని గురించి ఎవరూ మాట్లాడ టం లేదు. అతడు ఏ స్థానంలో బ్యాటింగ్ చేయాలి? అనేదాని పై స్పష్టత లేదు. ఆరో స్థానంలో వచ్చాడు.. అక్కడ ఏమైనా దూకుడుగా ఆడాడా? భారత జట్టులో తిలక్, హార్దిక్ పాండ్య వచ్చారంటే వారి బ్యాటింగ్ లోతు అలాంటిది. ఎలాంటి పోలిక పెట్టలేం. కొందరికి సల్మాన్ 'మంచి బాలుడు', 'మంచి కెప్టెన్'గా కనిపిస్తున్నాడు. కానీ, అతడు జట్టుకు చేసిందేమీ లేదు" అని అక్తర్ విమర్శించాడు.




## క్రెడిట్ కార్డ్ రిపోర్ట్..

### ఛార్జ్-ఆఫ్ గురించి తెలుసా..?

ఛార్జ్-ఆఫ్.. క్రెడిట్ కార్డులకు సంబంధించి ఈ పేరు ఎప్పుడైనా విన్నారా? మీ కార్డు రిపోర్ట్‌లో ఈ పదం ఉందంటే.. అది మీ సిబిల్ స్కోరుపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుంది. దీని వల్ల భవిష్యత్‌లో రుణాలు తీసుకోవడమూ ఇబ్బందికరంగా మారుతుంది. ఇంతకీ ఈ ఛార్జ్-ఆఫ్ అంటే ఏంటీ? దీన్ని ఎప్పుడు రిపోర్ట్ చేస్తారు? దీని వల్ల కలిగే నష్టాలేంటో చూద్దాం..!

### ఛార్జ్-ఆఫ్ అంటే..

- మీరు ఆరు నెలలపాటు లేదా అంతకంటే ఎక్కువ కాలం క్రెడిట్ కార్డు బకాయిల చెల్లింపులు చేయకపోతే.. రుణదాత (బ్యాంక్/ఫైనాన్స్ సంస్థ) మీ ఖాతాను రైటాఫ్ చేస్తారు. దాన్నే 'ఛార్జ్-ఆఫ్'గా పేర్కొంటారు.
- అయితే బ్యాంకుల్లో మాదిరిగా రైటాఫ్ అంటే.. మీకు రుణం నుంచి క్షమాభిక్ష ప్రసాదించినట్లు కాదు. ఛార్జ్-ఆఫ్ చేసినా పేమెంట్ మొత్తం చెల్లించాల్సిందే.
- రుణదాత ఆ మొత్తాన్ని వసూలు చేస్తారు లేదా బాకీని థర్డ్ పార్టీ కలెక్టింగ్ ఏజెన్సీలకు మీ కార్డును విక్రయిస్తారు.

### ఛార్జ్-ఆఫ్ చేస్తే ఏం జరుగుతుంది..?

- ఛార్జ్-ఆఫ్ వల్ల క్రెడిట్ స్కోర్ తీవ్రంగా దెబ్బతింటుంది. ఎందుకంటే పేమెంట్ హిస్టరీ అనేది మన సిబిల్ స్కోరులో ప్రధానమైన అంశంగా పరిగణిస్తారు.
- రుణదాతలు దీన్ని అధిక రిస్క్ ఉండే రుణాలకు సంకేతంగా పరిగణిస్తారు.
- దీంతో కొత్త లోన్లు, క్రెడిట్‌కార్డులు పొందడం చాలా కష్టం అవుతుంది. ఒకవేళ అప్పు లభించినా ఎక్కువ వడ్డీ రేట్లు, తక్కువ కాలవ్యవధి వంటి సమస్యలు ఎదురవుతాయి.


### ఇది ఎంతకాలం క్రెడిట్ ప్రొఫైల్‌లో ఉంటుంది?

- సాధారణంగా ఈ ఛార్జ్-ఆఫ్ అనేది 7 ఏళ్ల పాటు మన క్రెడిట్ రిపోర్ట్‌లో ఉంటుంది. మొదటి పేమెంట్ మిస్ అయిన తేదీ నుంచే ఇది ప్రారంభమవుతుంది.
- మీరు తర్వాత బాకీ తీర్చినా.. ఎంట్రీ పూర్తిగా తొలగదు. అయితే, అది అప్‌డేట్ అవుతుంది.
- ఆ ఛార్జ్-ఆఫ్ ఎంట్రీ అనేది పూర్తిగా తప్పుగా నమోదైన సందర్భంలోనే దాన్ని రికార్డుల నుంచి తొలగిస్తారు. అంటే తప్పు తేదీ, తప్పు మొత్తం, తప్పు ఖాతా నంబర్ వంటి అవాస్తవ వివరాలు ఉన్నపుడు మాత్రమే మీరు క్రెడిట్ బ్యూరో దగ్గర కంప్లయింట్ పెట్టి దాన్ని పూర్తిగా తొలగించవచ్చు.

### ఛార్జ్-ఆఫ్ తర్వాత ఎలా..?

మీరు తీసుకునే బాకీలు ఎప్పటికప్పుడు క్లియర్ చేయాల్సి ఉంటుంది. భవిష్యత్‌లో ప్రతి ఈఎంఐ, క్రెడిట్‌కార్డు బిల్లు సమయానికి చెల్లించాలి. క్రెడిట్‌కార్డు వినియోగం 30 శాతం లోపు మాత్రమే ఉండేలా చూసుకోవాలి. మీ క్రెడిట్ రిపోర్ట్‌ను క్రమం తప్పకుండా చెక్ చేసుకోవాలి. లోపాలు కనపడితే వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించి వాటిని సరిచేయించుకోవాలి.

## ఇమిగ్రేషన్ శాఖ స్పష్టత ఇవ్వడంతో.. తగ్గిన ఆందోళన : నాస్‌కామ్




హెచ్1బీ వీసాల ఫీజును పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనతో ఏర్పడిన గందరగోళాన్ని ఇమిగ్రేషన్ శాఖ వివరణ కొంత తీర్చిందని నాస్‌కామ్ (నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్) ప్రకటించింది. ఈమేరకు సోమవారం ఓ ప్రకటన జారీ చేసింది. యూఎస్ సిటిజన్ షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ దీనిపై ఎఫ్ఏక్యూ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ వివరణతో ప్రస్తుత వీసాదారులపై ట్రంప్ ప్రకటన ప్రభావం ఉండబోదని తేలిందని నాస్‌కామ్ పేర్కొంది. దీనికితోడు భవిష్యత్తులో కొత్తగా దరఖాస్తు చేసుకొనే వాటికి కూడా వన్‌టైమ్ ఫీజుగా స్పష్టమైందని పేర్కొంది. 2026 నుంచి ఈ వీసా ఫీజులు చెల్లించాల్సి ఉండటంతో.. ఈ లోపే కంపెనీలు స్థానికులకు శిక్షణ ఇచ్చి సిద్ధం చేసుకొనే అవకాశం ఉందని నాస్‌కామ్ అభిప్రాయపడింది. ప్రస్తుతం పరిశ్రమ ఇందుకోసం దాదాపు బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తోందని వెల్లడించింది. అమెరికాలో వ్యాపారం చేస్తున్న భారత్‌కు చెందిన కంపెనీలు కొన్నేళ్ల నుంచి నిలకడగా హెచ్1బీ వీసాలపై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించుకొంటూ వస్తున్నాయని నాస్‌కామ్ వెల్లడించింది.

PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083.,EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com